


తెలుగు జాతీయ దినపత్రిక
# అక్షర విజేత
నిజం నిర్భయం నిష్పక్షం
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక
జిల్లాల అనుబంధం




•సంపుటి : 4 •సంచిక : 217 హైదరాబాద్ సంపాదకులు బి.అనిల్ కుమార్ మంగళవారం 03 సెప్టెంబర్ 2024 •పేజీలు : 11 •వెల : 6/-

# కాంగ్రెస్‌ను కాదని
# కేసీఆర్ అధికారం చేపట్టడం అంత ఈజీనా?



**అక్షరవిజేత తెలంగాణ :** కేసీఆర్ అంటే తెలంగాణకు ఓ బ్రాండ్. తెలంగాణ రాష్ట్ర సాధనకు ఆయన చేసిన కృషి, పోరాట పటిమ అంతాఇంతా కాదు. ఒకవిధంగా చెప్పాలంటే కేసీఆర్ ప్రారంభించిన ఉద్యమం వల్లే తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిందని చెప్పొచ్చు. ఎన్నో దీక్షలు.. ఎన్నో సభలు.. మరెన్నో సమావేశాలు నిర్వహించి తెలంగాణ ఆవశ్యకతను ఊరూరా చాటి చెప్పారు. చివరకు లక్ష్యాన్ని సాధించారు. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదంతో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించింది. ప్రజలు సైతం కేసీఆర్ మీద నమ్మకంతో ఆయననే సీఎం సీట్లో కూర్చోబెట్టారు. ఒక్కసారి కాదు రెండు సార్లు అధికారాన్ని కట్టబెట్టారు. 2014, 2018లో బీఆర్ఎస్ పార్టీనే గెలిపించారు. దశాబ్దకాలం పాటు రాష్ట్రంలో ఏ ఎన్నికల్లో అయినా ఆ పార్టీకే ప్రజలు పట్టం కట్టారు. రాష్ట్రంలో ఇతర పార్టీ అనేది కనిపించలేదంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే రాష్ట్రంలో ఆ పార్టీ తిరుగులేని ఆధిపత్యాన్ని కొనసాగించింది. అంత వరకు బాగానే ఉన్నా.. ఏ నినాదంతో అయితే రాష్ట్రం ఏర్పాటు జరిగిందో వాటిలో కేసీఆర్ నెరవేర్చింది ఏంటో తెలంగాణ సమాజానికి పూర్తిగా తెలిసిందే..! నీళ్ల కోసం ప్రాజెక్టులు కట్టి తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు సర్వశక్తులూ ఒడ్డారు. లక్ష కోట్లతో ఏకంగా కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించారు. వాటితోపాటే మరికొన్ని ప్రాజెక్టులను నిర్మించారు. తెలంగాణ మొత్తానికి సాగు నీరు అందించడమే లక్ష్యంగా వాటి నిర్మాణానికి పూనుకున్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కేసీఆర్ ఇమేజీకి పెద్ద డ్యామేజీని తీసుకొచ్చిందనే చెప్పాలి. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా చేపట్టిన మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లు కుంగిపోయాయి. దాంతో ప్రాజెక్టు నిర్మాణంలోని వైఫల్యాలు వెలుగుచూశాయి. దాంతో ప్రజల్లోనూ మెలమెల్లగా ఆయనపై విశ్వాసం తగ్గింది. ఫైనల్లీ మొదటి సారి కేసీఆర్ పార్టీ ఓటమిని చవిచూడాల్సి వచ్చింది. 2023 నవంబర్ నాటి ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారాన్ని కోల్పోగా కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టింది. పీసీసీ చీఫ్‌గా ప్రచారంలో దూకుడుగా వ్యవహరించిన రేవంత్ రెడ్డి సీఎం అయ్యారు. ఆ ప్రభుత్వం కొలువుదీరి తొమ్మిది నెలలు అవుతోంది. కాంగ్రెస్ అధికారం చేపట్టిన నాటి నుంచే బీఆర్ఎస్ వైఫల్యాలను ఒక్కొక్కటిగా వెలుగులోకి తెస్తూ ముందుకు సాగుతోంది. ఇక ఓటమి నుంచి కేసీఆర్ సైతం సైలెంటుగానే ఉండిపోయారు. ఇటీవల తన కూతురు కవిత జైలు నుంచి విడుదల కావడంతో మళ్లీ ప్రజాక్షేత్రంలోకి వస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ నేతలు చెబుతున్నారు. ` సారూ కేసీఆర్ మళ్లీ యాక్టివ్ కాబోతున్నారని.. ఇక కాంగ్రెస్ ప్రభుత్వానికి చుక్కలే అంటూ ఆ పార్టీ నేతలు గొప్పలకు పోతున్నారు. అంతేకాదు మరో అడుగు ముందుకేసి త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పోయి మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఇప్పుడు ఇది కాస్త నెట్టింటా తీవ్ర చర్చకు దారితీసింది. ప్రజలు ఎంతగానో ఆదరించి కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారం కట్టబెడితే దానిని కూల్చడం అంత ఈజీనా..? ప్రజలు తిరస్కరిస్తేనే అధికారం కోల్పోయిన కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి ఎలా అవుతారు..? ఈ ప్రశ్నలకు సమాధానాలు బీఆర్ఎస్ నేతలకే తెలియాలి మరి!! ఇప్పటికే ఎన్నో అవినీతి, అక్రమాల విమర్శలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ పార్టీ ముఖ్యనేతలు, మాజీ మంత్రులు ఆ ఉచ్చు నుంచి ఎలా బయటపడుతారు..? వాటన్నింటిని పట్టించుకోకుండా మళ్లీ అధికారం చేపడుతామంటూ ప్రచారం సాగించడం ఏంటి..? కవిత జైలు నుంచి వచ్చినందుకు ప్రజాక్షేత్రంలోకి కేసీఆర్ వస్తుండడం మంచి పరిణామమే అయినప్పటికీ.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలదోస్తామని చెబుతుండడం మాత్రం అది ఆయన మైలేజీకే మైనస్ అవుతుందని పలువురు రాజకీయ నిపుణుల అభిప్రాయం.

## గీత కార్పొరేషన్ కు ఛైర్మన్ ను వెంటనే నియమించాలి
### -మోకుదెబ్బ రమేష్ గౌడ్ డిమాండ్



**అక్షర విజేత నర్సంపేట/** కల్లుగీత కార్పొరేషన్ కు చైర్మన్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నియమించాలని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ తెలిపారు. నర్సంపేట పట్టణంలో మోకుదెబ్బ జిల్లా కమిటీ సమావేశం అధ్యక్షులు గోపగాని వెంకట్ గౌడ్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా రమేష్ గౌడ్ మాట్లాడుతూ గీత కార్మికులకు సేఫ్టీ మోకులు (కాటమయ్య రక్షణ కవచాలు )పంపిణీ చేయడం హర్షనీయమని, అదే విదంగా ప్రతి గీత కార్మికునికి అందించాలన్నారు. తాటి, ఈత వనాలను పెంచడానికి ప్రభుత్వం భూమిని కేటాయించి ప్రోత్సహించాలన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా నందనం గ్రామంలో 2023 జులై 29 న అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం 7 కోట్ల నిధులతో నీరా ప్రాసెసింగ్ యూనిట్ నెలకొల్పిందని ఆయన పేర్కొన్నారు. పనులు పూర్తయి ఏడాది గడుస్తున్నా ప్రారంబానికి నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. హుస్నాబాద్ నియోజకవర్గం లోని సర్వాయిపేట గ్రామ పంచాయతీ పరిధిలోని కొమ్ము గుట్ట ప్రాంతాన్ని పర్యాటక ప్రాంతంగా నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని కోరారు. ఇప్పటికైనా గౌడ కులస్తులు రాజకీయాలకు అతీతంగా ఐకమత్యంతో పోరాడి తమ హక్కులు సాధించుకోవాలని రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు సొల్టీ సారయ్య గౌడ్, శీలం వీరన్న గౌడ్, మద్దెల సాంబయ్య గౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పంజాల వెంకట్ గౌడ్, డివిజన్ అధ్యక్షులు కందుల శ్రీనివాస్ గౌడ్, డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ నాంపల్లి వెంకటేశ్వర్లు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## రేపు 11 జిల్లాల్లో భారీ వర్షాలు..
### - అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించిన సీఎస్



**అక్షరవిజేత తెలంగాణ :** రాష్ట్రంలోని దాదాపు 11 జిల్లాల్లో మంగళవారం భారీ వర్షాలుంటాయని వాతావరణశాఖ హెచ్చరించిందని, ఈ క్రమంలో ఆయా జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశించారు. రానున్న 24గంటల్లో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరికలున్నాయన్నారు. ఆదిలాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కుమ్రంభీం ఆసిఫాబాద్, మెదక్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సీఎస్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయా జిల్లాల్లో వరద పరిస్థితులు, పునరావాసం, సహాయక చర్యలపై సమీక్షించారు. డీజీపీ జితేందర్, విపత్తుల నిర్వహణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్, ఫైర్ సర్వీసుల డీజీ నాగిరెడ్డి, నీటిపారుదల శాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్ ఈ టెలీకాన్ఫరెన్స్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున కలెక్టర్లు ముందస్తు ప్రణాళిక రూపొందించి.. ఆస్తి, ప్రాణనష్టం జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికు గత నాలుగైదు రోజులుగా వానలుపడుతున్నాయని, రానున్న భారీ వర్షాలతో పరిస్థితులు తీవ్రంగా ఉండే అవకాశం ఉందన్నారు. పోలీస్, తదితరశాఖలతో పటిష్టమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. స్థానిక పరిస్థితుల దృష్ట్యా విద్యా సంస్థలకు సెలవు ప్రకటించే విషయం జిల్లా కలెక్టర్లే నిర్ణయం తీసుకోవాలన్నారు.

## రాష్ట్రంలో భారీ వర్షాలు..
### రూ. 5 వేల కోట్ల నష్టం జరిగిందన్న సీఎం రేవంత్ రెడ్డి



**అక్షరవిజేత సూర్యాపేట :** రాష్ట్రంలో రూ. 5 వేల కోట్ల నష్టం జరిగిందని ప్రాథమిక అంచనా వేస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. తక్షణమే కేంద్రం రూ. 2 వేల కోట్లు కేటాయించాలని కోరామని పేర్కొన్నారు. జరిగిన నష్టాన్ని పరిశీలించడానికి ప్రధాన మోదీని ఆహ్వానించామని సీఎం చెప్పారు. ఖమ్మం జిల్లాకు వెళ్తున్న సీఎం రేవంత్ రెడ్డి.. సూర్యాపేట జిల్లాలో కాసేపు ఆగారు. జిల్లాలో జరిగిన పంట, ఆస్తి నష్టం వివరాలను సీఎం అడిగి తెలుసుకున్నారు. సాగర్ ఎడమకాలువ తెగడం వల్ల జరిగిన పంట నష్టంపైన ముఖ్యమంత్రి ఆరా తీశారు. సూర్యాపేట జిల్లాలో 30 సెం.మీ. అతి భారీ వర్షం కురిసిందన్నారు. అధికారులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉన్నారని తెలిపారు. పంట, ఆస్తి నష్టం పైన అధికారులు ప్రాథమిక నివేదిక ఇచ్చారు. మంత్రులు, ప్రజాప్రతి నిధులను క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉంచామన్నారు. ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా ప్రజాప్రతినిధులు, అధికారులు జాగ్రత్తలు తీసుకుంటున్నారని సీఎం పేర్కొన్నారు. ఖమ్మం, నల్లగొండ పరిస్థితి పైన ప్రధాని మోదీ, అమిత్ షా, రాహుల్ గాంధీకి వివరించి సాయం కోరినట్లు సీఎం తెలిపారు. వర్షాల కారణంగా చనిపోయిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం, పశువులు చనిపోతే రూ. 50 వేల సాయం, పంట నష్టం జరిగితే ప్రతి ఎకరానికి రూ. 10 వేల సాయం, ఇళ్లు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని సీఎం ప్రకటించారు. సూర్యాపేట కలెక్టర్‌కు తక్షణ సాయంగా రూ. 5 కోట్లు కేటాయిస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు. పాఠశాల సెలవులపైన జిల్లా కలెక్టర్లకు నిర్ణయాధికారం ఇచ్చామన్నారు. వరద బాధితులకు సాయం చేయడానికి ముందుకు వచ్చిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడికి ధన్యవాదాలు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ రాష్ట్రానికి నిధులు తీసుకువచ్చేందుకు పని చేయాలి. రాజకీయాలకు ఇది సమయం కాదు అని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

# భారీ వర్షాలతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలి

## - పిఏసిఎస్ చైర్మన్ మారుతి రెడ్డి



అక్షరవిజేత,కంగ్టి : మండల వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కంగ్టి పిఏసిఎస్ చైర్మన్ మారుతి రెడ్డి కంగ్టి ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. భారీ వర్షాల సమయంలో ప్రతి ఒక్కరూ వీలైనంతవరకు ఇంట్లోనే ఉండాలని, అత్యవసరమైతేనే బయటకు వెళ్ళాలని. గత రెండు, మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయని,మరో రెండు రోజులు వర్షాలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలియజేశారు. వర్షాల వల్ల తడిసిన కరెంటు స్తంభాలు, విద్యుత్ తీగలు, ఇనుప స్తంభాలు తాకకుండా జాగ్రత్తగా ఉండాలని కోరారు. ఇంట్లో విద్యుత్ పరికరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు బయటకు రాకుండా చూసుకోవాలి. రైతులు పొలాల్లో విద్యుత్ స్తంభాలు, తీగలకు దూరంగా ఉండాలన్నారు. ఉధృతంగా ప్రవహిస్తున్న కాలువలు చెరువుల వద్దకు వెళ్లకండి. శిథిలావస్థలో ఉన్న ఇళ్ళలో ఉండే ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలనారు. డ్రైనేజీ కాలువలు వాగులు వంకల వద్దకు ప్రజలు వెళ్ళకుండా పూర్తి జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు.

# వామ్మో కుక్కలు..దొరికామా అంతే..!



-కాలనీల్లో కుక్కల బెడద.!

-భయపడుతున్న కాలనీ వాసులు,చిన్నారులు.

-మున్సిపల్ కమిషనర్ జర ఇటువైపు చుడండి.!

-కాపాడాలని స్థానికులు విన్నపాలు.

అక్షరవిజేత,రంగారెడ్డి బ్యూరో: షాద్ నగర్ మున్సిపాలిటీలోని విజయనగర్ కాలనీతో పలు కాలనీల్లో కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ దడ పుట్టిస్తున్నాయి.కుక్కల సమూహం ఎక్కువగా ఉందని,వీటివల్ల చిన్నారులకు ప్రమాదం పొంచి ఉందని,దీంతో పాటు వివిధ కాలనీల నుంచి కూడ కూడా కుక్కల సమూహంతో పిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారని మీడియా ద్వారా తెలిపారు..మున్సిపాలిటీ అధికారులు తక్షణమే స్పందించి కుక్కలను నియంత్రణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు...

# ప్రజల బాగు కోసం తపించిన మహనీయుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి

## -వైయస్ చిత్రపటానికి ఘన నివాళులు అర్పించిన మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి



అక్షరవిజేత, పాపన్నపేట ప్రజల బాగు కోసం నిరంతరం పరితపించిన మహనీయులు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తో పాటు తెలుగు వారి హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలను మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్ రెడ్డి కొనియాడారు.వైఎస్ రాజశేఖర్ రెడ్డి 15వ వర్ధంతి సందర్భంగా ఆయన స్వగృహంలో వైయస్ చిత్రపటానికి పూలమాలు వేసి ఘన నివాళులు అర్పించారు. 2004 లో వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వంలో తాను మెదక్ శాసన సభ్యునిగా ఉన్నానని, వైయస్ ప్రభుత్వంలో అప్పట్లో తాను ఎమ్మెల్యేగా పనిచేయడం తనకెంతో గర్వంగా సంతోషాన్ని ఇచ్చిందన్నారు. వైఎస్ ఇచ్చిన మాటను మడప తిప్పకుండా అమలు చేసే వ్యక్తి అని శశిధర్ రెడ్డి కొనియాడారు. ప్రధానంగా అప్పట్లో 2004 లో ఉచిత విద్యుత్తు ఫైల్ పై తొలి సంతకం చేసి రికార్డుకెక్కారన్నారు. ముఖ్యంగా రైతులకు సహకార రుణమాఫీ కోసం కేంద్రాన్ని ఒప్పించి పీకల లోతులో అప్పుల్లో మునిగి ఉన్నటువంటి రైతులకు విముక్తి కలిగించినటువంటి మహా వ్యక్తి వైఎస్ అన్నారు. పేద ప్రజలకు సంబంధించి కార్పొరేట్ వైద్యం అందించే విధంగా అత్యంత ఖరీదైన వైద్యాన్ని నిరుపేదలకు అందించే పథకం ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రపంచంలో ఎక్కడ కూడా లేని విదంగా ప్రార&భించారన్నారు. 108, 104 వాహనాల ద్వారా అత్యవసర అంబులెన్స్ వాహనాలను, ఉచిత మందుల సరఫరాను రాష్ట్రమంతటికి అందుబాటులోకి తీసుకొచ్చిన మహా వ్యక్తి వైఎస్ అని గుర్తుచేశారు. బీసీ విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్య కోసం ఫీజు యొక్క రియంబర్స్మెంట్ పథకాన్ని ప్రవేశపెట్టారని తెలిపారు. ముస్లిం మైనార్టీ విద్యార్థుల గురించి నాలుగు శాతం రిజర్వేషన్లతో ఇంజనీరింగ్ విద్యను అందించారన్నారు. అనేక విధాలుగా మరి తెలంగాణ ప్రాంతానికి రాష్ట్రవ్యాప్తంగా జల యజ్ఞం అని అదేవిధంగా జలయజ్ఞంతో భారీ మధ్యతరహా, చిన్నతరహ సాగు ప్రాజెక్టులను రాష్ట్రమంతటా నలుమూలల విస్తరింపజేసి పథకాలను స్వీకారం చుట్టి అమలు చేశారని శశిధర్ రెడ్డి గుర్తు చేశారు. ఇందిరమ్మ పెన్షన్లు, ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు, మహిళ గ్రూపులకు పావలావడ్డీ కే రుణాలు,రాజీవ్ నగరబాట, రాజీవ్ పల్లె బాటల లో మారుముల గ్రామాలన్నింటికీ రోడ్లను వేసిన విషయాన్ని,తన విజ్ఞప్తి మేరకు 50 శాతం రాష్ట్రప్రభుత్వం వాటా భరిస్తుందని అప్పటి ప్రధాని మన్మోహన్ ను ఒప్పించి మెదక్ కు రైల్వే లైన్ వైఎస్ మంజూరు చేయించారని గుర్తు చేస్తూ, రాష్ట్రానికి వైయస్ రాజశేఖర్ రెడ్డి చేసిన సేవలను శశిధర్ రెడ్డి కొనియాడారు. వైఎస్ తో చాలా అనుబంధాలు, సంబంధాలు ఉండి,ఆత్మీయులు గా ఉండేవారినని శశిధర్ రెడ్డి పేర్కొన్నారు.

# అక్రమ ఇసుక రవాణా చేస్తున్న లారీని పట్టుకున్న సిద్దిపేట పోలీసులు



అక్షర విజేత సిద్దిపేట సోమవారం ఉదయం తెల్లవారుజామున సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్వి ప్రసాద్ ఆస్పిటల్ సమీపంలో హైదరాబాద్ వెళుతున్న టీఎస్ 19 టి 8298 గలదాని డ్రైవర్ నిచ్చు సంతోష్, యజమాని గికూరి భాస్కర్ ఇరువురు కలసి ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నారని నమ్మదగిన సమాచారం పై సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు మరియు సిద్దిపేట త్రీ టౌన్ పోలీసులు వెళ్లి పట్టుకున్నారు.త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించారు.

ఈ సందర్భంగా టాస్క్ ఫోర్స్ అధికారులు మాట్లాడుతూ ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, పిడిఎస్ రైస్, మొరము, మట్టి అక్రమ రవాణా చేసిన మరియు పేకాట, జూదం, గంజాయి ఇతర మత్తు పదార్థాలు విక్రయించిన కలిగి ఉన్న చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడు తున్నటు సమాచారం ఉంటే వెంటనే సిద్దిపేట టాస్క్ ఫోర్స్ ఆఫీసర్స్ 8712667445 ఆఫీసర్స్ 8712667447, 8712667446, నెంబర్లకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

# చింతలమాధర జలపాతం సందర్శన నిలిపివేత



అక్షర విజేత అదిలాబాద్ ప్రతినిధి:- భారీ వర్షాల కారణంగా కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా తిర్యాని మండలంలోని.. చింతలమాధుర జలపాతం రెండు రోజుల పాటు సందర్శకులకు అనుమతి ఉండదని ఏకో టూరిజం కమిటీ చైర్మన్ గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు సందర్శకులు ఎవరు కూడా రాకూడదని తిరిగి సమాచారం అందించే వరకు సందర్శకులకు అనుమతి నిలిపివేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు

# నిత్యవసర వస్తువులను పంపిణి చేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.



అక్షరవిజేత,రంగారెడ్డి బ్యూరో: గత రెండు రోజుల నుండి కురిసిన భారీ వర్షాలకు నిర్దవెల్లి గ్రామంలో కూలిన ఇండ్లను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సందర్శించి, వివరాలు అడిగి తెలుసుకున్నారు .అనంతరం బాధితులకు మండల కాంగ్రెస్ అధ్యక్షులు గూడ వీరేష్ ఆధ్వర్యంలో వారికి ఆర్థిక సహాయంగా నిత్యవసర వస్తువులను,నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,, ఎవరు అధైర్యపడవద్దని మీకు ప్రభుత్వం అండగా ఉందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి,కాంగ్రెస్ మహిళా నాయకులు జూలపల్లి అనసూయ ముదిరాజ్,కేశంపేట మండల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది..

# భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ, ఐపీఎస్



అక్షర విజేత సిద్దిపేట కుకునూరు పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని చిన్న కిష్టాపూర్ ఎల్లాయగూడ గ్రామాల మధ్య చెరువు నిండి పొంగిపొల్లి రోడ్డుపై వస్తున్న గా రోడ్డు దాటడానికి ఇబ్బంది పడుతున్న వారిని కుకునూరు పల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది సృజన్, వంశీ, హుటా హుటిన అక్కడికి వెళ్లి స్వయంగా పిల్లలను ఎత్తుకొని రోడ్డు దాటించడం జరిగింది. ఎల్లాయిగూడ గ్రామ ప్రజలు విపత్కర పరిస్థితులలో పోలీసులు చేస్తున్న సేవలను అభినందించారు.

# ఎస్ టి పి & ట్రీట్మెంట్ ప్లాంట్ పంప్ హౌజ్ సందర్శించిన కమిషనర్ అశ్రిత్ కుమార్



అక్షర విజేత సిద్దిపేట చింతల్ చెరువు వద్ద గల ఎస్ టి పి మురుగు నీటి శుద్ధి కర్మాగారం లో సిద్దిపేట పట్టణంలోని ఇళ్ళ నుండి వచ్చే మురుగు నీరు శుద్దీకరణ విధానాన్ని పరిశీలించారు. మురుగు నీటి ప్రవాహాన్ని నిరోధించడం, మురుగునీటిని 100% శుద్ధి చేయడం మరియు వ్యవసాయ అవసరాల కోసం శుద్ధి చేసిన నీటిని తిరిగి ఉపయోగించడం. జరుగుతున్నదనీ మరియు మురుగునీటి శుద్ధి కర్మాగారాలు మురుగునీటిని సేకరించడం, శుద్ధి చేయడం మరియు విడుదల చేయడం, పర్యావరణం మరియు ప్రజారోగ్యానికి అవసరమైన సేవను అందిస్తాయి కాబట్టి నిర్వహణ సరిగా ఉండాలని అధికారులను ఆదేశించారు. మరియు సిద్దిపేట పట్టణ ప్రజలకు త్రాగు నీరు సరఫరా చేసే కమ్మర్లపల్లి లోని వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ మరియు పంప్ హౌజ్ లో పర్యటించారు. నీటిలో మడ్డినీ తొలగించే అలం ఎంత శాతం వేస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. నీటిని క్లోరిఫై చేసే ట్యాంకులను పరిశీలించారు.కార్యక్రమం లో అన్వేష్ ఎ ఈ వనిత సానిటరీ ఇన్స్పెక్టర్ పాల్గొన్నారు.

# తోటపల్లి వాగులో గల్లంతైన మల్లయ్య గురించి రిస్క్యూ టీం ఆపరేషన్



**అక్షర విజేత సిద్దిపేట** ఆదివారం రోజు సాయంత్రం లక్ష్మణ్ తంది మల్లయ్య, వయస్సు 45 సంవత్సరములు, కులం గంగపుత్ర, గ్రామం తోటపల్లి, మండలం బెజ్జంకి, నిన్న సాయంత్రం చేపలు పట్టడానికి వెళ్లి తోటపల్లి వాగులో కొట్టుకుని పోయినాడు, ఎలాగైనా మృతదేహాన్ని వెలికి తీసే విధంగా చర్యలు చేపట్టాలని పోలీస్ కమిషనర్ ఆదేశానుసారం రూరల్ సీఐ శ్రీను, ఆధ్వర్యంలో గజ ఈతగాళ్ల సహాయంతో ఉదయము నుండి రిస్క్యూ ఆపరేషన్ చేయడం జరుగుతుంది ఇంతవరకు శవం మృతదేహం దొరకలేదు. రెస్క్యూ కొనసాగుతుందని రూరల్ సిఐ ఒక ప్రకటనలో తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో పొలాల అమావాస్య పండుగ





**అక్షర విజేత అదిలాబాద్ ప్రతినిధి:-** ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో పొలాల అమావాస్య పండుగ వేడుకలను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు ఆనవాయితీగా వస్తున్న ఆచారం ప్రకారం కొనుగోలు చేసిన మట్టి ఎడ్లను ఇంటి వద్ద ప్రతిష్టించి పూలు పండ్లు పత్రిలతో అలంకరించి ఇంట్లో ప్రత్యేకంగా తయారుచేసిన పిండి వంటకాలు నైవేద్యాలుగా సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు అందరూ ఎల్లకాలం సుఖ సంతోషాలతో బాగుండాలని మొక్కుకున్నారు

# డ్రంక్ అండ్ డ్రైవ్ లో 9 మందికి రూ.12.500/- వేల రూపాయలు జరిమానా

**అక్షర విజేత సిద్దిపేట** సిద్ధిపేట వన్ టౌన్ ఇన్స్పెక్టర్ లక్ష్మీ బాబు సిబ్బందితో కలిసి గత కొన్ని రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలో ముస్తాబాద్ చౌరస్తా ఎన్సాన్ పల్లి చౌరస్తాలలో వాహనాలు తనిఖీ చేయగా, 09, మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుం డగా పట్టుకొని బ్రీత్ ఎనలైజర్ తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు రాగా సోమవారం రోజు సిద్దిపేట స్పెషల్ సెకండ్ క్లాస్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు, న్యాయమూర్తి ముందు హాజరుపరచగా విచారణ చేసి 09 మందికి ? 12,500/-వేల రూపాయల జరిమాన విధించారు. ఈ సందర్భంగా వన్ టౌన్ ఇన్స్పెక్టర్ లక్ష్మీ బాబు మాట్లాడుతూ వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడిపి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని తెలిపారు.

# రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

**అక్షర విజేత జయశంకర్ భూపాలపల్లి ప్రతినిది:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన కొడారి శ్రీకాంత్ (25) అనే యువకుడు సోమవారం ఉదయం 10 గంటల సమయంలో జమ్మికుంట రైల్వే స్టేషన్ పరిధిలోని బిజిగిరి షరీఫ్ వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో మొగుళ్లపల్లి మండలంలో విషాద ఛాయలు అమ్ముకున్నాయి. కొడారి శ్రీకాంత్ చీమకు కూడా హాని తలపెట్టడని గ్రామస్తులు కన్నీటి పర్యంతమవుతున్నారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.



# వినాయక చవితి మండపం కు రేకుల పంపిణీ.

**అక్షర విజేత అదిలాబాద్ ప్రతినిధి:-** కాంగ్రెస్ యువ నాయకుడు పూదరి హరీష్ కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలోని తుంగేడ గ్రామం బెస్త వాడలో వినాయక చవితి సందర్భంగా మండపం కొరకు రేకులను విరాళంగా వారి తల్లి పుదారి పద్మ చేతులమీదుగా అందించడం జరిగిందని అదే విధంగా వినాయక మండపాల దగ్గర కమిటీ సభ్యులు ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరపకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తుంగేడ కాంగ్రెస్ యువ నాయకుడు పూదరి హరీష్ తెలిపారు ఈ కార్యక్రమంలో భామిని బాబాజీ భామిని మహేష్,భామిని వాగు డి.మురళీ కృష్ణ యువకులు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు



# సెప్టెంబర్ 17 నుంచి ప్రజాపాలన

**-కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు పింగిలి జ్యోతిరెడ్డి**

**అక్షర విజేత జయశంకర్ భూపాలపల్లి ప్రతినిది:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజల కోసం మరో కీలకమైన నిర్ణయం తీసుకున్నారని, ప్రభుత్వం ఏర్పాటైన కొత్తలో ప్రజాపాలన దరఖాస్తులను స్వీకరించిన ప్రభుత్వం..హెల్త్, రేషన్ కార్డుల వివరాలను సేకరించేందు కోసం ఇప్పుడు మరో దఫా సెప్టెంబర్ 17 నుంచి ప్రజాపాలన కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యాచరణను రూపొందించారని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం జిల్లా ఉపాధ్యక్షురాలు పింగిలి జ్యోతిరెడ్డి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. పూర్తి హెల్త్ ప్రొఫైల్ తో



రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి హెల్త్ కార్డు మంజూరు చేయాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఇందుకు సంబంధించి క్షేత్రస్థాయిలో పూర్తిగా అధికారులను సన్నద్ధం చేస్తోందన్నారు. దీంతో ఇకపై రేషన్ కార్డులకు, హెల్త్ కార్డులకు లింకు ఉండబోదన్నారు. ప్రజా పాలనలో ప్రతి కుటుంబం నుంచి అందుకు అవసరమైన వివరాలను ప్రభుత్వం సేకరిస్తోందన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూజల గోపికృష్ణ.**

**అక్షర విజేత సిద్దిపేట** సిద్దిపేట అర్బన్ తడ్కపల్లి గ్రామంలో ఇల్లు కూలిపోయిన వారి కుటుంబాలకు మనోధైర్యం ఇచ్చిన గోపికృష్ణ.

భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సిద్దిపేట నియోజకవర్గ వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులను, కార్యకర్తలను అప్రమత్తం చేసిన సిద్దిపేట నియోజకవర్గ ఇంచార్జ్ పూజల హరికృష్ణ వారి ఆదేశాలతో సోమవారం రోజు సిద్దిపేట అర్బన్ మండలంలోని తడ్కపల్లి గ్రామంలో భారీ వర్షాలకు కూలిన ఇండ్లను సిద్దిపేట అర్బన్ మండల అధ్యక్షులు బిక్షపతి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శంకర్ గౌడ్ తో కలిసి సందర్శించిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూజల గోపికృష్ణ.

అనంతరం వర్షాలతో కూలి పోయిన ఇండ్లకు వెంటనే నష్ట పరిహారం ఇవ్వాలని అధికారులను కోరారు. వారి కుటుంబాలకు మనోధైర్యం ఇచ్చారు.ప్రభుత్వం నుండి పూర్తి సహాయ సహకారాలు అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, గ్రామాల్లో కానీ, పట్టణంలో కానీ ఎక్కడ ఏ సమస్య ఉన్న తమ దృష్టికి తీస్తే వెంటనే అధికారులతో మాట్లాడి ప్రభుత్వం నుండి సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వం అని వారికి చెపుతూ, ఎవరివి అయితే ఇండ్లు కూలిపోయాయో, వారికి మనోధైర్యం నింపారు.

ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ సీనియర్ నాయకులు



కాలీముద్దీన్, కొంగ సాంబమూర్తి, ఎర్ర మహేందర్, జనార్దన్ రెడ్డి. అజ్మత్, నవీన్ ముదిరాజ్,ప్రవీణ్ అలాగే స్థానిక నాయకులు, అంబటి శంకర్ గౌడ్ , తొడెంగల నవీన్ ముదిరాజ్, డాకి కర్ణకర్, దుబ్బాక రాజు, బైరి నవీన్ ముదిరాజ్, పర్శరములు ,దాకి చంద్ర,గజ్జెల లింగం,శివ్వి రాజయ్య తదితరలు పాల్గొన్నారు...

## ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా

# మెడికల్ క్యాంపును నిర్వహించాలి

**-లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి.**

**-ఉస్మాన్ నగర్ లోతట్టు ప్రాంతాలను సందర్శించిన జిల్లా కలెక్టర్ శశాంక.**

**అక్షరవిజేత,రంగారెడ్డి బ్యూరో:** ఉస్మాన్ నగర్ లోని లోతట్టు ప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులను ఆదేశించారు.భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ శశాంక ఉస్మాన్ నగర్ లోని లోతట్టు ప్రాంతాలన్నీ సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడుతూ,,,ఉస్మాన్ నగర్ లో లోతట్టు ప్రాంతాల్లో నివాసం ఉంటున్న ప్రజలను తక్షణమే అక్కడి నుండి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని,మంచి నీటి వనరులైన ట్యాంకులు కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవడంతో పాటు,వారికి ఎలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా మెడికల్ క్యాంపును నిర్వహించి అంటూ వ్యాధులు ప్రబల కుండా బ్లీచింగ్ పౌడర్, క్లోరినేషన్ లను చేపట్టాలని తెలిపారు.వైద్య బృందాలు అప్రమత్తమై,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో తగు మందులను సిద్ధంగా ఉంచాలని వైద్యధికారికి ఆదేశించారు.అనంతరం బాలాపూర్ గణేషుని యొక్క ఊరేగింపు జరిగే మార్గాన్ని మరియు అందుకోసం చేపడుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించి అక్కడ జరిగే సీసీ రోడ్డు పనులను పరిశీలించారు.పనులను 2 నుండి 3 రోజుల్లోగా పూర్తి చేసి వీధి దీపాలను ఏర్పాటు చేయుటకు మరియు శానిటేషన్ నిర్వహించాలని సూచించడం జరిగింది.కలెక్టర్ వెంట మహేశ్వరం ఏసిపి లక్ష్మీకాంత్ రెడ్డి,జల్ పల్లి మున్సిపల్ కమిషనర్ వాణిరెడ్డి,అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,ఇరిగేషన్ %రాజు% మరియు మున్సిపల్ సిబ్బంది సంబంధిత అధికారులు తదితరులు హాజరుకావడం జరిగింది...



# చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కె.ఎస్ రత్నంకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన

**బిజెపి జిల్లా అధ్యక్షుడు మాధవరెడ్డి, వికారాబాద్ నియోజకవర్గ కోఆర్డినేటర్ "వడ్ల నందు"**



అక్షరవిజేత, వికారాబాద్ ప్రతినిధి శంకర్పల్లి డి ఎమ్ ఆర్ ఫంక్షన్ హాల్ లో బిజెపి పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరై, బిజెపి పార్టీ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు మాధవరెడ్డి ఆధ్వర్యంలో చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే "కేఎస్ రత్నంకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శివరాజ్, సీనియర్ నాయకులు కేపీ రాజు, వికారాబాద్ నియోజకవర్గ బిజెపి పార్టీ కోఆర్డినేటర్ "వడ్ల నందు, కేపి రాజు తదితరులు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ లో ఒకరికి జైలు శిక్ష 14 మందికి 23,000/-వేల రూపాయలు జరిమానా

అక్షర విజేత సిద్దిపేట సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ కుమార్, సిబ్బందితో గత కొన్ని రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తా, చౌరస్తాలలో మరియు రాజీవ్ రహదారిపై వాహనాలు తనిఖీ చేయగా, 14, మంది వ్యక్తులు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా పట్టుకొని బ్రీత్ ఎనలైజర్ తో తనిఖీ చేయగా మద్యం సేవించి ఉన్నారని రిపోర్టు రాగా సోమవారం రోజు సిద్దిపేట సెకండ్ క్లాస్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కాంతారావు, న్యాయమూర్తి ముందు హాజరుపరచగా విచారణ చేసి 14 మందికి ? 23,000/-వేల రూపాయల జరిమాన విధించారు. మరియు ఒక వ్యక్తికి 2 రోజుల జైలు శిక్ష విధించారు.

జైలు శిక్ష పడిన అతని వివరాలు ఎస్.కె తౌఫిక్ తండ్రి శైలంసాబ్, వయస్సు 34 సంవత్సరాలు, వృత్తి డ్రైవర్,

కూకట్పల్లి హైదరాబాద్.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ ప్రవీణ్ కుమార్, మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడవదని, మరియు రోడ్డు నిబంధనలు, ట్రాఫిక్ నిబంధనలు పాటించే వాహనాలు నడపాలని, రోడ్డు ప్రమాదాల నివారణ గురించి మాత్రమే ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించడం జరుగుతుందన్నారు.

# ఘనంగా పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు





అక్షర విజేత : మరికల్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు మరికల్ మండలంలోని జిన్నారం గ్రామంలో ఆయన అభిమానులు ఎడవెల్లి బాలరాజ్ ఘనంగా నిర్వహించారు. సోమవారం జిన్నారం గ్రామంలో పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు సందర్భంగా ఎడవెల్లి బాలరాజ్ తన సొంత ఖర్చులతో నిరుపేదలకు ఉచితంగా చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు ఓటమితో కృంగిపోలేదు, నేడు గెలుపుతో పొంగిపోలేదు పడిలేచిన కెరటంలా అఖండ విజయంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్ కళ్యాణ్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## బొంతపల్లి శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి వారి దేవాలయంలో స్వామి వారికి అభిషేకం నిర్వహించిన కాట దంపతులు



అక్షర విజేత పటాన్చెరువు గుమ్మడిదల మండలం బొంతపల్లి గ్రామంలోని శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామి దేవాలయంలో స్వామివారికి అభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి, శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో స్వామి వారిని దర్శించుకున్న పటాన్ చెరు నియోజకవర్గ ఇంఛార్జి కాట శ్రీనివాస్ గౌడ్ గారు వారి సతీమణి సంగారెడ్డి జిల్లా మహిళా అధ్యక్షురాలు కాట సుధాశ్రీనివాస్ గౌడ్ గారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛారణలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను అందజేసి వారిని ఘనంగా సన్మానించారు.

# ప్రజావాణికి 71 దరఖాస్తులు

**-ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి**

**-జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**



అక్షరవిజేత, వికారాబాద్ ప్రతినిధి ప్రజావాణి కార్యక్రమం ద్వారా వచ్చిన ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కారించాలని,ప్రజావాణి కి 71 దరఖాస్తులు వచ్చాయని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు.సోమవారం కలెక్టరెట్ సమావేశం హాలు నందు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు ద్వారా స్వీకరించిన ప్రజా సమస్యలను త్వరగా పరిష్కారం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన 71 మంది ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో 71 అర్జీలు రాగా భూ సమస్యలు 59, పింఛన్లు 02, ఇతరములు 10 వచ్చాయని కలెక్టర్ తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు ఆర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, , ఆర్ డి ఓ వాసు చంద్ర, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు

# కమిషనర్ అశ్రిత్ కుమార్ రెవెన్యూ మెప్మా సిబ్బందితో సమీక్ష సమావేశం





అక్షర విజేత సిద్దిపేట : బ్లాక్ స్పాట్ లు లేకుండా కృషి చేద్దాం.స్టీల్ బ్యాంక్ లను సద్వినియోగం చేసుకునేలా చూద్దాం. ఇంటి పన్ను మరియు నీటి పన్ను వసూలు చేయుటకు ఎంత మంది బిల్ కలెక్టర్ లు ఉన్నారు. ఒక్కొక్కరికి ఎన్ని రెవెన్యూ బ్లాక్ లు ఉన్నాయి,ఎన్ని అసెస్మెంట్ లు ఉన్నాయి,ఏప్రిల్ నెలలో 5 శాతం రాయితీ ద్వారా ఎంత పన్నులు వసూలు చేశారని,వారు వసూలు చేయాల్సిన డిమాండ్ ఎంత మరియు ఇప్పటివరకు ఎంత పన్ను వసూలు చేశారని అడిగి తెలుసుకున్నారు. మీ పరిధిలో ఎక్కడైనా నూతన గృహాలకు అసెస్మెంట్ చేయాల్సినవి ఉంటే వాటిని గుర్తించి అసెస్మెంట్ చేయాలని ఆదేశించారు. సిద్దిపేట మహిళలు అన్నింటా ముందుంటారని వారి సహకారంతో సిద్దిపేటకు ఎన్నో అవార్డులు రావటానికి తమ వంతు కృషి చేశారని గుర్తు చేస్తు ఆర్ పి లను అభినందించారు. మహిళలు సంఘటితమైతే సాధించలేనిది ఏదీ లేదన్నారు. అందరి సహకారంతో సిద్దిపేటకు మరిన్ని అవార్డులు తీసుకువద్దామన్నారు. సిద్దిపేట పట్టణంలో ఉన్నటువంటి అన్ని స్టీల్ బ్యాంకులను పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. ఎలాంటి శుభకార్యాలు జరిగిన ప్లాస్టిక్ పేపర్లు, గ్లాసులు వాడకుండా స్టీల్ బ్యాంకు ను వాడేలా చూడాలన్నారు.

సిద్దిపేట పట్టణంలో ఎక్కడ చెత్త కుప్పలు లేకుండా చేద్దామని ఎవరైనా బహిరంగ ప్రాంతాల్లో చెత్త వేసినట్లయితే వెంటనే పారిశుద్ధ్య సిబ్బందికి సమాచారం అందించాలని తెలిపారు. సమావేశంలో శ్రీకాంత్ ఆర్ ఓ ,బాలకృష్ణ యు డి ఆర్ ఐ ,సాయికృష్ణ టి ఎమ్ సీ ,రమ్య,జ్యోతి సీ ఓ ,ఆర్పీ లు,బిల్ కలెక్టర్ లు తదితరులు పాల్గొన్నారు.

# భద్రత, బందోబస్తు కొరకే గణేష్ ఆన్లైన్ నమోదు విధానం

**గణేష్ మండప నిర్వాహకులు పోలీసు శాఖ వారు రూపొందించిన పోర్టల్ ద్వారా వివరాలను నమోదు చేసుకుని పోలీసు వారికి సహకరించాలి: జిల్లా ఎస్పీ శ్రీ కే. నారాయణ రెడ్డి**



అక్షరవిజేత, వికారాబాద్ ప్రతినిధి భద్రత బందోబస్తు కొరకే గణేష్ ఆన్లైన్ నమోదు విధానం అని జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి సోమవారం వికారాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్.పి కే. నారాయణ రెడ్డి, మాట్లాడుతూ పోలీసు శాఖ వారు రూపొందించిన గణేష్ మండపం నిర్వహణకు సంబంధించిన ఆన్లైన్ అప్లికేషన్ అనేది కేవలం మండపం నిర్వహణ మండపంనకు సంబంధించిన సమాచారం కొరకు మాత్రమే రూపొందించిందని అని, ఈ సమాచారం ద్వారా భద్రత, బందోబస్తు ఏర్పాటు చేయడానికి పోలీసు అధికారులకు సులువుగా ఉంటుందని , ఆన్లైన్ ఇన్ఫర్మేషన్ కు ఎటువంటి రుసుము లేదని ఎస్పీ తెలిపారు. గణేష్ ఉత్సవాల నిర్వాహకులు గణేష్ విగ్రహాల ఏర్పాటు సమాచారం ఆన్లైన్ లో పొందుపరిచి పోలీసుస్టేషన్ల లో సమాచారం ఇవ్వాలని అందుకోసం తమ తమ కంప్యూటర్ లు , మొబైల్ ఫోన్స్ నందు ఆన్లైన్ అప్లై చేసుకోవాలి అని అన్నారు. గణేష్ మండపాల ఏర్పాటు కొరకు పోలీస్ శాఖ అనుమతి నిమిత్తం %https://policeportal.tspolice.gov.in/index.htm ఈ లింకు ద్వారా సంప్రదించగలరు అని తెలిపినారు.వినాయక మండపాల నిర్వాహకులకు జిల్లా ఎస్పీ పలు సూచనలు చేయడం జరిగింది. మండపం ఏర్పాటు చేసే సమయం లో షార్ట్ సర్క్యూట్ జరుగకుండా మంచి నాణ్యత గల వైరును ఉపయోగించి పలు జాగ్రతలు పాటించాలి. గణేష్ మండపాల నిర్వాహకులు వారి మండపాల కమిటీ వివరాలు, మండపాల బాధ్యత వహించే వారి వివరాలు, ఫోన్ నెంబర్ల ను మండపంలో ఏర్పాటు చేయాలి. తమ పరిధిలోని పోలీస్ అధికారుల ఫోన్ నెంబర్ లు కల్గి ఉండాలి.మండపాల్లో ఎట్టిపరిస్థితులోను డిజేలను ఏర్పాటు చేయరాదు. గణేష్ ప్రతిమలు కూర్చుండబెట్టే ప్రదేశంలో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా షెడ్ నిర్మాణంలో మంచి నాణ్యత గల షెడ్ ఏర్పాటు చేయవలెను. గణేష్ మండపంలో 24 గంటలు ఒక వాలంటీర్లు ఉండే విధంగా నిర్వహకులు తగు చర్యలు తీసుకోవాలి.గణేష్ మండపాలకు వచ్చే భక్తుల సందర్శను దృష్టిలో వుంచుకోని మండపాలలో భక్తుల కోసం క్యూలైన్లను ఏర్పాటు చేయడంతో పాటు వాలంటీర్లను నియమించాలి. గణేష్ మండపాల వద్ద ఎప్పుడైన ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత చర్యలు తీసుకోవాలి. నిర్వాహకులు తప్పనిసరిగా తమ మండపాలలో పాయింట్ పుస్తకం ఏర్పాటు చేసుకోవాలి, పోలీసు అధికారులతనిఖీకి వచ్చినప్పుడు అందులో వ్రాసి సంతకం చేస్తారు. మండపాల్లో ఏదైనా అనుమానాస్పదంగా బ్యాగులు, ప్లాస్టిక్ సంచులు, వస్తువులు లేదా వ్యక్తులు కనిపించినట్లుయితే తక్షణమే డయల్ 100గాని లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలి.సామాజిక మాధ్యమాలలో వచ్చే ఎలాంటి రూమర్స్, వదంతులను నమ్మకూడదు ఎవ్వరికైన ఎలాంటి సందేహాలు ఉన్న సంబంధిత పోలీసు వారికి లేదా డయల్ 100 కి కానీ జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 8712670056 కు సమాచారం అందించాలని సూచించారు.

# ప్రజల మనసులలో నిండి ఉన్న నాయకులు రాజశేఖరరెడ్డి

## వెల్జాల్ లో ఘనంగా డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలు



**అక్షరవిజేత,రంగారెడ్డి బ్యూరో:** నేటికి ప్రజల గుండెల్లో నిలిచి ఉన్న నాయకులు స్వర్గీయ రాజశేఖరరెడ్డి అని అన్నారు మాజీ ఉప సర్పంచ్ అజీజ్,మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి,ఆరిఫ్. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి, స్వర్గీయ డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి 15వ వర్ధంతి వేడుకలను తలకొండపల్లి మండల పరిధిలోని వెల్జాల్ గ్రామంలో గ్రామ మాజి ఉప సర్పంచ్ అజీజ్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజి ఉప సర్పంచ్,మాజీ ఎంపీటీసీలు మాట్లాడుతూ,,,రాజశేఖరరెడ్డి మరణించిన గాని ఆయన సేవలను ప్రజలు మరువలేరని అన్నారు. ప్రజల మనసులలో నిండి ఉన్న నాయకులు రాజశేఖరరెడ్డని చెప్పారు. పేదల పెన్నిధి,బలహీన వర్గాల ఆశాజ్యోతి,ఆరోగ్య ప్రధాత, ఫీజు రియంబర్స్మెంట్ తో ఎంతోమంది విద్యార్థులను డాక్టర్లుగా,ఇంజనీర్లుగా,పోలీసులుగా,తీర్చిదిద్దిన ఘనత రాజశేఖరరెడ్డి కే దక్కుతుందని అన్నారు. ఆ మహానుభావుడి ప్రాజెక్టుల నిర్మాణాలతో వ్యవసాయాన్ని పండగల మార్చిన గొప్ప రైతు బాంధవుడని కీర్తించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు జి.శ్రీనివాస్ మూర్తి,ఏంఅంబాజీ,మాజీ ఉప సర్పంచ్ అజీజ్,మండల కాంగ్రెస్ మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎండి ఆరిఫ్,గ్రామ అధ్యక్షుడు ఏం.డి అబ్బాస్,నాయకులు సి వెంకట్ రెడ్డి,ఏ వెంకట్ రెడ్డి ,పి దశరథం,టి.కృష్ణ గౌడ్ ఎం బన్సీలాల్,టీ జగ్గయ్య, ఏ వెంకటయ్య గౌడ్,రవీందర్ గౌడ్,ఏ వెంకటరెడ్డి, వద్దే రాజు,చింతకాయల లక్ష్మణ్,పులిజాల విష్ణు,ఎల్ మల్లేష్,ఎండి నసిర్, పి వేణు,ఎండి జాఫర్,ఎం రమేష్, ఎం.డి.రహమత్,ఎం ఏ ఆఫ్తాబ్,తదితరులు పాల్గొన్నారు...

# మర్పడగ క్షేత్రంలో సోమవతీ అమావాస్య



**అక్షర విజేత కొండపాక** కొండపాక మండలం మర్పడగ గ్రామంలోని శ్రీ విజయదుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్రంలో శ్రావణ మాసం అమావాస్య సోమవారం కలిసి రావడంతో సోమవతీ అమావాస్యను పురస్కరించుకుని మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు క్షేత్ర నిర్వాహకులు హరినాథశర్మ ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభం అయింది. క్షేత్రం ఆవరణలోని రావిచెట్టు వద్ద శివపార్వతుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు సోమవారం అమావాస్య కలిసి రావడం విశేషమైన పర్వదినమని క్షేత్ర నిర్వాహకులు చెప్పెల హరినాథశర్మ అన్నారు. గ్రహణసమయంతో సమానమైన సోమవతీ అమావాస్య రోజున చేసే జపం,తప,దానములు విశేష ఫలితాలనిస్తాయని చెప్పారు. ముఖ్యంగా మహిళలు ఈ వ్రతాన్ని ఆచరించడం వల్ల సత్సంతాన ప్రాప్తి సౌభాగ్యం చేకూరుతాయని తెలిపారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు కార్యక్రమంలో క్షేత్ర నిర్వహణా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# గంగమ్మ తల్లి నీకు వందనం

**-మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి నేతృత్వంలో దూసకల్ గ్రామంలో చెరువు అలుగు వద్ద గంగమ్మకు పూజలు**

**- గ్రామంలో వైఎస్సార్ కు నివాళి**

**- దూసకల్ శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.**



**అక్షరవిజేత,రంగారెడ్డి బ్యూరో:** గంగమ్మ తల్లి నీకు వందనాలు..మా ప్రాంతంలో పాడి పంటలను చల్లగా చూడు.. నీవు తడిసిన ఈ నేలలో సిరుల పంట కురిపించు.. బీద బిక్కి గుడ్డు గోదా ముసలి ముతక పిల్లజల్లా చల్లంగా ఉండేటట్టు దీవించు మాయమ్మ గంగమ్మ అంటూ షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి తదితరులు చెరువులోని అలుగు వద్ద ప్రత్యేక పూజలు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా విస్తరంగా కురుస్తున్న భారీ వర్షాలకు దూసకల్ గ్రామంలో చెరువు నుండి అలుగు పారుతున్న శుభ సందర్భంగా గంగమ్మ తల్లికి కొబ్బరికాయ కొట్టి పూలతో పూజించారు. ఈ సందర్భంగా గ్రామంలో వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి భారీ గజమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం స్థానిక శివాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, యాదయ్య యాదవ్, బాలరాజ్ గౌడ్, తిరుపతి రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కొంకల్ల చెన్నయ్య, శ్రీకాంత్ రెడ్డి, అగనూరు బస్వం, కుమార్ స్వామీ, దంగు శ్రీనివాస్ యాదవ్, హరినాథ్ రెడ్డి, కృష్ణారెడ్డి, అందే మోహన్, సింగారం సుదర్శన్, ఇబ్రాహీం, లింగారెడ్డిగూడెం అశోక్, సీతారాం, ముబారక్ అలీ ఖాన్, సయ్యద్ ఖదీర్, గంగమోని సత్తయ్య, నడికుడ యాదగిరి యాదవ్, చంద్రశేఖర్, మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు...

# ధన్వాడ మండల పర్యటన

**-ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి.**





**అక్షర విజేత/మరికల్/ధన్వాడ** పేట జిల్లా ధన్వాడ మండలంలో నారాయణపేట శాసన సభ్యురాలు డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి పర్యటించారు. ధన్వాడ పెద్ద చెరువును మండలంలోని నీటమునిగిన పంటలను తెగిపోయిన రహదారులను పరిశీలిం చడం జరిగింది. తాత్కాలికంగా వేయవలసిన రోళ్లను వేయవలసిందిగా అధికారులకు ఆదేశిం చారు. అనంతరం ధన్వాడ మండల ప్రజా లకు ఎవరు మనోధైర్యం కోల్పోరాదని అమె ధైర్యం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నీట మునిగిన బంతి పూల తోట

**-కన్నీరు మున్నీరవుతున్న రైతు.**

**-ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతు.**



**అక్షరవిజేత,రంగారెడ్డి బ్యూరో:** రేపో మాపో పంటను కోసి మార్కెట్ లో అమ్ముకుని నాలుగు డబ్బులు వెనకేసుకుందామని అనుకుంటే భారీ వర్షాలు రావడంతో బంతి పూల తోట మొత్తం నీటిలో మునిగి చేతికి రాకుండా పోయిందని ఆవేదన చెందుతున్నారు మధ్యతరగతి రైతు. రైతు అందించిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామానికి చెందిన రాంరెడ్డికి చెందిన 2 ఎకరాల్లో వేసిన బంతిపూల తోట నిన్న కురిసిన వర్షానికి నీటమునిగి పోవడం జరిగిందని తెలిపారు. పంట విలువ సుమారు 3లక్షల వరకు ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చేతికి వచ్చిన పంట నీటిలో మునిగిపోవడంతో ఏం చేయాలో తెలియడం లేదని,తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు..

# సదస్సు కరపత్రాలను ఆవిష్కరించిన కే పర్వతాలు



**అక్షర విజేత సిద్దిపేట** కులగణన చేపట్టాలని 10న సదస్సు.... రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ స్వాగతిస్తూ బీసీ కులగణ న చేపట్టాలని బహుజన మహాసభ ఆధ్వర్యంలో హైదరాబాదులోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలోఈ నెల 10న నిర్వహించే సదస్సును విజయం చేయాలని బహుజన మేధావులను కుల సంఘాల నాయకులు బహుజన మహాసభ రాష్ట్ర నాయకులు కే పర్వతాలు కోరారు .సదస్సు కరపత్రాలను సోమవారం పెద్ద గడియారం చౌరస్తాలోని అమరవీరుల స్థూపం వద్ద ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ దేశంలో రాష్ట్రంలో బహుజనులు రిజర్వేషన్లు జనాభా ప్రాతిపదికన అందుకోలేకపోతున్నారు పాలకులు చేస్తున్న నిర్లక్ష్యాన్ని ఎండగడుతూ ఉద్యమాలు నిర్వహించడం కోసం నిర్వహించే సదస్సు లో ప్రతి బహుజనుడు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు మోహన్ ,గురువయ్య సాగర్ , జానకిరామ్ రెడ్డి వీరస్వామి శివప్రసాద్తదితరులు పాల్గొన్నారు.

# దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికి ఘన నివాళులు

**-పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్ ఝాన్సీ రెడ్డి**



**అక్షర విజేత : తొర్రూరు, మహబూబాబాద్ ప్రతినిధి :** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి అహర్నిశలు కృషి చేశారని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి కొనియాడారు. సోమవారం పాలకుర్తి నియోజకవర్గం తొర్రూరు పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించి, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈసందర్భంగా పాలకుర్తి ఎమ్మెల్యే యషస్విని రెడ్డి,మాట్లాడుతూ, వైఎస్ రాజశేఖరరెడ్డి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, కార్యకర్తలకు అన్ని రకాలుగా అవకాశాలు ఇచ్చారని చెప్పారు. ఆయన చూపిన మార్గదర్శకత్వంలో మనందరం పయనించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు,యూత్ అధ్యక్షులు,మహిళ అధ్యక్షురాలు,పార్టీ శ్రేణులు,కార్యకర్తలు,మహిళ నాయకురాలు , సోషల్ మీడియా కో ఆర్డినేటర్లు యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ వై యస్ రాజశేఖర్ రెడ్డి 15 వర్ధంతి సందర్భంగా ఘననివాళులు



**అక్షర విజేత కొండపాక** వైయస్ రాజశేఖర్ రెడ్డి 15వ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని వెలికట్ట క్రాసూ రోడ్ వద్ద పూల మాల వేసి వారికి ఘన నివాళులు అర్పించడం జరిగింది. కార్యక్రమంలో కొండపాక కునూరుపల్లి మండలాల అధ్యక్షులు వీరుపాక శ్రీనివాస్ రెడ్డి వాసరి లింగారావు మాజీ ఎంపిటిసి చింతలసాయి బాబా, రెడ్డమైన రావింధర్, పి ఏ సి ఎస్ డైరెక్టర్ బూర్గుల సురేంధర్ రావు, సోషల్ మీడియా కోర్డినేటర్ మెరుగు ప్రభాస్,వెలికట్ట గ్రామ శాఖ అధ్యక్షులు, పెరుగు తిరుపతి, నాల్గం కనకయ్య, బిక్షపతి, తదితరులు, పాల్గొన్నారు.

# అకాల వర్షాలకు ఇల్లు కూలిన కుటుంబాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి

**-ఆ కుటుంబానికి పునరావాసం కల్పించి, డబల్ బెడ్ రూమ్ ఇల్లు ఇవ్వాలి**

**-సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్లం అశోక్**



అక్షర విజేత : తొర్రూరు, మహబూబాబాద్ ప్రతినిది గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఇల్లు కూలి నిరాశ్రయులైన పేద కుటుంబానికి పునరావాసం కల్పించి, ఆ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్లం అశోక్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం తొర్రూరు మున్సిపాలిటీ లోని 4వ వార్డులో సిపిఎం పార్టీ బృందం సిపిఎం జిల్లా నాయకులు బొల్లం అశోక్, సిపిఎం మండల కార్యదర్శి ఎండి యాకుబ్ లు రాజీవ్ నగర్లో నివాసం ఉంటున్న ట్రాక్టర్ డ్రైవర్ మారుపల్లి శ్రీనివాస్ ఇల్లు గత రెండు రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న టువంటి భారీ వర్షాలకు పూర్తిగా దెబ్బతిని గోడలు పగిలి శిధిలావస్థలో ఉన్న ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇల్లు శిధిలావస్థలో ఉండి నిలువ నీడ లేక 80 సంవత్సరాల తల్లి, భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి తీవ్ర ఇబ్బందులు పడుతూ దిక్కుతోచని స్థితిలో ఉన్న శ్రీనివాస్ కుటుంబాన్ని ప్రభుత్వ అధికారులు మరియు ఎమ్మెల్యే సందర్శించి వారికి తక్షణమే పునరావాసం కల్పించడంతో పాటు ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇల్లు ఇప్పించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ అకాల వర్షాలకు తొర్రూరు మండలంలో ఉన్నటువంటి అనేక గ్రామాల్లో పాత ఇండ్లు కూలిపోయే పరిస్థితిలో ఉన్నాయని వాటిని కూడా అధికారులు సందర్శించి సర్వే నిర్వహించాలని కోరారు. ఆకాల వర్షాలకు చాలా గ్రామాలలో వాగులు, వంకలు తెగి పంట నష్టం తీవ్రస్థాయిలో జరిగిందని.. ఈ పంట నష్టాన్ని వ్యవసాయ అధికారులతో అంచనా వేయించి నష్టపోయిన రైతాంగానికి నష్టపరిహారం చెల్లించేలా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లే విధంగా స్థానిక ఎమ్మెల్యే, అధికారులు కృషి చేయాలని కోరారు.

# ఘనంగా రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలు



అక్షర విజేత సిద్దిపేట చిన్నకోడూరు మండల కేంద్రంలో ఓబిసి సెల్ మండల అధ్యక్షులు బంక చిరంజీవి యాదవ్ ఆధ్వర్యంలో దివంగత మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బంక చిరంజీవి మాట్లాడుతూ పేద ప్రజల గుండెల్లో రాజశేఖర్ రెడ్డి ఎప్పుడు బతికే ఉంటారు అని గుర్తు చేశారు. తన చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. గతంలో రాజశేఖర్ రెడ్డి చేసిన ఉచిత కరెంటు, రెండు రూపాయలకే కిలో బియ్యం, ఫీజు రీఎంబర్స్మెంట్, ఇందిరమ్మ ఇండ్లు, ప్రాజెక్టులు తను చేసిన మంచి పనులే నేటికీ తనని గుర్తు చేస్తున్నాయని అన్నారు.

ఇట్టి కార్యక్రమంలో కిసాన్ సెల్ మండల అధ్యక్షులు మేకల ఎల్లయ్య, వర్కర్స్ కాంగ్రెస్ కమిటీ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు ఆంకర్ మధు, జిల్లా నాయకులు అజ్జు యాదవ్, ఫిషర్స్ మాన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండు వెంకట్, ఓబీసీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంగిటి బాలరాజు, మండల సీనియర్ నాయకులు మేకల పోచమల్లు, గుడుమల్ల మల్లేశం, ఎండి.బాబుమియా, ఉడుత ఎల్లయ్య, కోనేటి కర్ణాకర్, గౌరవోయిన స్వామి, జేరిపోతుల రాజేందర్, కొలను కనకయ్య రైతులు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అక్షర విజేత రాయికల్: భారీ వర్షాలు కురిసిననేపథ్యంలో రాయికల్ పట్టణంలోని పెద్ద చెరువు పూర్తిస్థాయిలో నిండి, ఉధృతంగా నీటి ప్రవాహంతో పారుతున్న మత్తడి స్థానిక నాయకులతో కలిసి పరిశీలించిన జగిత్యాల నియోజకవర్గ శాసనసభ్యులు డా:సంజయ్ కుమార్. జగిత్యాల నియోజకవర్గ ప్రజలు అందరూ భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని,

అత్యవసర పని ఉంటే మాత్రమే బయటకు రావాలని, పొంగుతున్న వాగులు, వాగులపై నిర్మించిన వంతెన రోడ్లు దాటే ప్రయత్నం చేయవద్దని ప్రజలను కోరారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఉంటే అధికారుల దృష్టికి, తన దృష్టికి తీసుకురావాలని,

ఇదివరకే అధికారులను ఫోన్ ద్వారా అప్రమత్తం చేశామని ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు, పడిగెల రవీందర్ రెడ్డి, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు పిప్పోజిమహేందర్ బాబు, నాయకులు చంద్రతేజ, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# వరదల్లో కొట్టుకుపోయిన స్థలాలను పరిశీలించిన మంత్రి సీతక్క

**-ఎవరు అధైర్య పడొద్దు... అందరినీ ఆదుకుంటాం**

**-రావిరాలలో బాధితులను ఓదార్చిన మంత్రి సీతక్క..**

**-ధైర్యంగా ఉండండి..అందర్నీ ఆదుకుంటాం..**

**-కూలిపోయిన ఇండ్ల స్థానంలో ఇందిరమ్మ ఇండ్లు**

**-మంత్రి ధనసరి అనసూయ(సీతక్క)**

**-భోజన వసతి దుస్తులు అందజేస్తాం.. ఎంపీ,ఎమ్మెల్యే**



అక్షర విజేత : నెల్లికుదురు, మహబూబాబాద్ ప్రతినిధి జిల్లా నెల్లికుదురు మండలం రావిరాల గ్రామంలో రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క,ఎంపీ పోరిక బలరాం నాయక్,ఎమ్మెల్యే డా.మురళి నాయక్,కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ లతో కలిసి సోమవారం వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించి బాధితులకు మనోధైర్యం కల్పించి ఓదార్చారు.కూలిపోయిన ఇండ్లను చూశారు. గొర్లు,ద్విచక్ర వాహనాలు ఆటో కొట్టుకుపోయిన బాధితులను పరామర్శించి వారితో మాట్లాడారు.అనంతరం మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మాట్లాడుతూ..గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా సామాన్య ప్రజలు ఇబ్బందులు పడకుండా జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని ఎవరు అధైర్యపడవలసిన అవసరం లేదన్నారు.వర్షాల కారణంగా కూలిపోయిన ఇండ్ల స్థానంలో ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని తెలిపారు.జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో ఇప్పటికే కలెక్టరేట్ లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి వచ్చిన సమస్యలను వెంటవెంటనే పరిష్కరించడం జరుగుతుందని ఆమె తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు సమస్యలను సమీక్షించి అంచనా వేయాలన్నారు.అందుకు అనుగుణంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు.

**భోజన వసతి తో పాటు అన్ని విధాలుగా ఆదుకుంటాం**

-ఎంపీ బలరాం నాయక్,ఎమ్మెల్యే మురళి నాయక్.

వరద బాధితులందరినీ ప్రభుత్వం ఆదుకుంటుందని ఎంపీ పలరాం నాయక్ భరోసా ఇచ్చారు. అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎమ్మెల్యే డా.మురళి నాయక్ మాట్లాడుతూ మండలంలోని చిన్ననాగారం పరిధిలోని ఎర్రగుంట చెరువు గండి పడటంతో రాజుల కొత్తపల్లి రావిరాల తదితర చెరువులు గండిపడ్డాయన్నారు.నీరు ఇళ్లకు చేరి ప్రజలు,పశువులు ఇబ్బందులకు గురి కావడం బాధాకరమన్నారు. పరిస్థితులు చక్కదిద్దేవరకు భోజన వసతి ఏర్పాటు చేస్తామని చెప్పారు.ఎవరు అధైర్యానికి గురి కావద్దని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ధీమా కల్పించారు. రావిరాల పరిసర ప్రాంతాలను పరిశీలించాలని మంత్రి సీతక్కను తాను కోరగానే ఈ ప్రాంతానికి వచ్చి పరిస్థితిని చూశారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్,అదనపు కలెక్టర్ (రెవిన్యూ) డేవిడ్,ఆర్డీవో అలివేలు,తహసిల్దార్ కోని చింతల రాజు స్థానిక నాయకులు ప్రభాకర్ గౌడ్,ఎదెల్ల యాదవ రెడ్డి,సత్యపాల్ రెడ్డి,అశోక్ గౌడ్,లక్ష్మారెడ్డి,రాస వెంకట్రెడ్డి యాలాద్రి పేద గ్రామాల నాయకులు తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులు పరిసరాల పరిశుభ్రత,వ్యక్తిగత పరిశుభ్రత జాగ్రత్తలు తీసుకోవాలి

**-వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అవగాహనా కల్పించాలి.**

**-షాద్ నగర్ ఎస్సీ, ఎస్టి, బీసీ హాస్టళ్లలో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరం**



అక్షరవిజేత,రంగారెడ్డి బ్యూరో: రంగారెడ్డి జిల్లా వైద్య అధికారి బి. వెంకటేశ్వరరావు ఆదేశాను సారము షాద్ నగర్ డివిజన్లో అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏరియాలో ఉన్న ప్రభుత్వ ఎస్టి,ఎస్సి,బిసి హాస్టల్లో ప్రభుత్వ మెడికల్ క్యాంపులను నిర్వహించి, విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి,విద్యార్థులకు వారి యొక్క అస్వస్తను బట్టి వారికి తగిన మందులను అందజేశారు.ఇందులో భాగంగా షాద్ నగర్,ఫరూక్ నగర్ లోని ఎస్టి బాలుర హాస్టల్లలో డాక్టర్ నాగేంద్రబాబు మరియు హెల్త్ ఎడ్యుకేటర్ జె .శ్రీనివాసులు వారి సిబ్బంది కలిసి బాలుర హాస్టల్లో ఉన్న మొత్తం బాలురు 100 మంది పరీక్షించి, అందులో నలుగురి బాలురలకు జ్వరము,ఎనిమిది మంది బాలురకు కోల్డ్, ఒక అబ్బాయికి గాయముకు సంబంధించిన మందులను అందజేయడం జరిగిందని జె. శ్రీనివాసులు మీడియాకు తెలియజేశారు.విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రత గురించి,వ్యక్తిగత పరిశు భ్రత గురించి, వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు.మధ్యాహ్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం చించోడ్ ఏరియా, సబ్ సెంటర్ “బి” రాఘవేంద్ర కాలనీలోని ఎస్సీ బాలికల వసతి గృహములో ఇంటర్ మరియు డిగ్రీ చదువుతున్న విద్యార్థులు మొత్తం 211 మంది ఉన్నారు.అందులో అస్వస్థకు గురైన వారిని గుర్తించి పరీక్షించి,ఇద్దరికి (2) జ్వరము కు సంబందించిన మందులు,ఐదుగురికి (5) కోల్డ్ కు సంబంధించిన మందులు, 12 మంది విద్యార్థులకు జనరల్ మెడిసిన్స్ ఇవ్వడం జరిగింది అని హెల్త్ ఎడ్యుకేటర్ జే శ్రీనివాసులు తెలియజేశారు.విద్యార్థులకు వర్షాకాలంలో వచ్చే వ్యాధులు,మలేరియా ,ఫైలేరియా, డెంగ్యూ,చికెను గనియా వ్యాధుల పట్ల అవగాహన కలిగిస్తూన్నారు.దోమలు పుట్టకుండా,కుట్టకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి తెలియచేశారు.విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత గురించి,పరిసరాల పరిశుభ్రత గురించి,హ్యాండ్ వాష్ టెక్నిక్స్ గురించి హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు తెలియజేశారు.అనంతరం డాక్టర్ జగదీశ్వర్ , జై శ్రీనివాసులు హాస్టల్ యొక్క వంటగదిని పరిశీలించి, వంట మనసులకు పరిశుభ్రత గురించి తగు సూచనలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ జగదీశ్వర్, హెల్త్ ఎడ్యుకేటర్ జే శ్రీనివాసులు, ఎస్టి హాస్టల్ వార్డెన్ రాజు,ఎస్ సి హాస్టల్ వార్డెన్ సులోచన,ఏఎన్ఎంలు లక్ష్మి,మంజుల,స్వప్న,ఆశాలు పాల్గొన్నారు...

# వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ఆత్రం సుగుణక్క

**-వరదల భారిన పడకుండా ప్రజలు స్వీయ నియంత్రణ పాటించాలి**



అక్షర విజేత జైనూర్ ఆదిలాబాద్ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తున్నాయని,ప్రజలు అప్రమత్తంగా వుండాలని కాంగ్రెస్ పార్టీ పార్లమెంట్ ఇంచార్జి ఆత్రం సుగుణక్క తెలిపారు.గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జలమయమైన లోతట్టు ప్రాంతాల్లో సోమవారం ఆమె పర్యటించారు.. ఉట్నూర్, ఇంద్రవెల్లి మరియు .సిరికొండ మండలం రాంపూర్ గ్రామంలో నీట మునిగిన పంట పొలాలు, ధ్వంసమైన రహదారులను పరిశీలించారు.పంట నష్టంపై రైతులతో మాట్లాడారు.

రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని,అధైర్య పడొద్దని సుగుణక్క రైతులకు భరోసా ఇచ్చారు. వరదల బారిన పడకుండా ప్రజలు స్వీయ నియంత్రణ పాటించాలని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలు వరదలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటుందని తెలిపారు.

# తొర్రూర్ మైనార్టీ గురుకుల బాలికల వసతి గృహంలో కరెంట్ షాక్...

-మైనార్టీ హాస్టల్ ముందు విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన

-భయభ్రాంతులకు గురవుతున్న విద్యార్థులు...

-సమస్యను కప్పిపుచ్చాలని చూస్తున్న ప్రిన్సిపల్ వనజ

-పిల్లలను పంపించమంటున్న ఉపాధ్యాయులు

-మైనార్టీ హాస్టల్లోని సమస్య ను తెలియపరచకుండా దాస్తున్న ప్రిన్సిపాల్ మరియుఉపాధ్యాయులు...

- మైనార్టీ హాస్టల్ గేటుకు తాళాలు వేసి విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులు పెడుతున్న వైనం....






**అక్షర విజేత : తొర్రూర్, మహబూబాబాద్ ప్రతినిధి** భారీగా కురుస్తున్న వర్షాలకు తొర్రూర్ మైనార్టీ బాలికల వసతి గృహంలో కరెంట్ షాక్ కొట్టడం వల్ల విద్యార్థులు భయభ్రాంతులకు గురయ్యారు... ప్రస్తుతం ఈ హాస్టల్ ఒక ప్రైవేట్ బిల్డింగ్ లో ఉన్నది. ఆ బిల్డింగ్ కి ప్లాస్టింగ్ లేకపోవడం వలన రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో గోడలు నిమ్ము రావడం వలన కరెంట్ షాక్ కొడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గత రెండు రోజుల నుండి కురుస్తున్న వర్షాల కారణంగా హాస్టల్లో వసతులు కరువయ్యాయని తాగడానికి మంచి నీళ్లు లేక గోడలు నిమ్ము రావడంతో కరెంట్ షాక్ కొడుతుందని విద్యార్థులు వారి తల్లిదండ్రులకు తెలిపారు. గతంలో కూడా కరెంట్ షాక్ రావడం వలన విద్యార్థులను హాస్టల్ నుండి ఇంటికి పంపించారని విద్యార్థుల తల్లిదండ్రులు అన్నారు. అదేవిధంగా మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ఆదివారం రోజున కూడా సుమారు 100 మంది విద్యార్థులను ఇంటికి పంపించారని విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. ఇట్టి విషయం బయటికి వస్తుందన్న నెపంతో కొందరి విద్యార్థులను హాస్టల్ లోనే ఉండనిచ్చి గేట్లకు తాళాలు వేసి వారి తల్లిదండ్రులను సైతం కలవకుండా ఇంటికి పంపివ్వ ము అంటూ ఇక్కడ అంతా మంచిగానే ఉన్నాది అంటూ మైనార్టీ హాస్టల్ ప్రిన్సిపాల్ మరియు ఉపాధ్యాయులు అంటూ హాస్టల్ లోని పలు సమస్యలను కప్పిపుచ్చుతున్నారు.విద్యార్థులు తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మా పిల్లలకి ఏమన్నా అయితే ఊరుకునేది లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

### విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రిన్సిపల్ వనజ

గత మూడు రోజుల నుండి హాస్టల్లో కరెంట్ లేకపోవడం వలన బాలికలకు కనీస అవసరాలకు కూడా నీరులేని పరిస్థితి ఉంది అని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు.విద్యార్థులకు కలకృత్యాలు తీసుకోవడానికి కూడా వర్షపు నీరే ఆధారంగా మారింది అని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.విద్యార్థులు దిక్కుతోచని స్థితిలో వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి పరిస్థితి వివరించగా విద్యార్థుల తల్లిదండ్రులు హాస్టల్ వద్దకు హుటాహుటిన చేరుకొని మా పిల్లలను మాతో పంపించండి అని ఉపాధ్యాయులను కోరగ...హాస్టల్ లో ఉన్న ఉపాధ్యాయులు ఇక్కడ ఎలాంటి ఇబ్బంది లేదు ఎలాంటి కరెంట్ షాక్ రావడం లేదు పిల్లలను మీతో పంపించము అని సమాధానం చెప్పాగ విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తు మా పిల్లలకి ఏమైనా జరిగినట్టయితే ఊరుకొన్నది లేదనీ అన్నారు.గతంలో ఇలాంటి సంఘటన ఇదే హాస్టల్లో జరిగిందన్నారు. అయినా కూడా అధికారులు తమకు ఏం పట్టనట్టు ఉండటం గమనార్ధంగా ఉంది.ఇప్పటికైనా సంబంధిత ఉన్నత అధికారులు తక్షణమే స్పందించి తొర్రూర్ మైనార్టీ హాస్టల్ సందర్శించి హాస్టల్లోనే పలు సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు ఏ హాని జరగకుండా చూసుకోవాలని విద్యార్థులకు అన్ని విధముల సౌకర్యాలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరారు.

### మైనారిటీ హాస్టల్ ప్రిన్సిపల్ వనజ వివరణ

ఇట్టి విషయంపై మైనార్టీ హాస్టల్ ప్రిన్సిపాల్ వనజ ను చేరవాణి ద్వారా వివరణ కోరగా... విద్యార్థులే కావాలని కరెంట్ షాక్ కొడుతుందని రూమర్స్ సృష్టించి విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేసుకుని రప్పించారన్నారు .విద్యార్థులకు ఎలాంటి సమస్యలు లేవంటూ... కరెంట్ షాక్ కొట్టడం లేదంటూ... విద్యార్థుల తల్లిదండ్రులే వచ్చి ఇక్కడ గొడవ చేస్తున్నారు. అంటూ సమాధానం చెప్పారు.

# కుండపోత వర్షానికి మరిపెడ, చిన్నగూడూర్ మండలాలు అతలాకుతలం

- రహదారి పనులు వెంటనే పునరుద్ధరించాలి
- సీతారాం నాయక్ తండాని సందర్శించిన మంత్రి సీతక్క



**అక్షర విజేత మరిపెడ:-** గత రెండు రోజులు నుండి కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నియోజకవర్గంలో సుమారు 15 గంటలు కుండపోత వర్షం కురిసింది. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. చాలా ఏండ్ల తర్వాత రికార్డు స్థాయిలో వర్షం పడినట్లు అధికారులు చెబుతున్నారు.

జల విలయానికి నిలువెత్తు నిదర్శనం మహబూబాబాద్ మరిపెడ రహదారి పురుషోత్తమయా గూడెం, ఆకేరు వద్ద కిలోమీటరు మేర రోడ్డు ద్వసం కావడం వల్ల అన్ని వైపుల నుంచి మహబూబాబాద్ కు రాకపోకలు బంద్ అయ్యాయి. భారీ వర్షాల కారణంగా దెబ్బతిన్న మరిపెడ మండలం తండ ధర్మారం పక్కన ఉన్న సీతారాం తండా గ్రామంలో సోమవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, మంత్రి ధనసరి అనసూయ సీతక్క, డోర్నకల్ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్, గ్రామంలో నివాసం ఉంటున్న ఇళ్లలో నీరు చేరడంతో భయభ్రాంతులతో ఉన్న ప్రజలకు ధైర్యం ఇస్తూ ఆరోగ్య పరిస్థితులు గురించి తెలుసుకున్నారు వారికి దుప్పట్లు పులిహోర ప్యాకెట్లు బియ్యం వాటర్ బాటిల్స్ నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు బ్రిడ్జి ఏరియాలో ప్రజల రాకపోకల సమస్యలు అదేవిధంగా నేలమట్టమైన నేషనల్ రహదారిని సందర్శించారు వెంటనే పనులు పునరుద్ధరించాలని మంత్రి ఆదేశించారు. మంత్రితో పరిశీలించిన మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ జిల్లా కలెక్టర్ జిల్లా ఎస్పీ సుధీర్ ఆర్ కేకన్ వారితోపాటు అదనపు కలెక్టర్ రెవిన్యూ డేవిడ్ మున్సిపల్ చైర్ పర్సన్ డాక్టర్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ ఆర్డిఓ అలివేలు మరిపెడ ఎమ్మార్వో ఎంపీడీవో సీఐ రాజ్ కుమార్ గౌడ్ ఎస్సై సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# చంటి ముదిరాజుకు, డాక్టరేట్ పట్టా



**అక్షర విజేత జయశంకర్ భూపాలపల్లి ప్రతినిది:** రాష్ట్రంలో అనేక విద్యార్థి ఉద్యమాలకు మరియు సామాజిక ఉద్యమాలకు నాయకత్వం వహించి పేద విద్యార్థులు అభ్యున్నతి కోసం పాటుపడిన సోషల్ యాక్టివిస్ట్ చంటి ముదిరాజ్ కు సోషల్ సర్వీస్ విభాగంలో డాక్టరేట్ పట్టా పొందారు. చంటి ముదిరాజ్ ఎన్నో సంవత్సరాలుగా ఎన్జీవోలో పనిచేస్తూ సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆయన చేస్తున్న సేవలను గుర్తించి డే స్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ టెక్సాస్ యు.ఎస్.ఎ చంటి ముదిరాజ్ చేసిన సంఘ సేవ, సామాజిక సేవకు గుర్తించిన డే స్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ టెక్సాస్ యు.ఎస్.ఎ విశ్లేషించి గౌరవప్రదంగా ఆయనకి డాక్టరేట్ పట్టా ప్రదానం చేశారు.. హైదరాబాదులో సోమవారం జరిగిన కార్యక్రమంలో చంటి ముదిరాజ్ కు డాక్టరేట్ అందించారు.సామాజిక సేవలో ఎప్పుడూ ముందుండే చంటి ముదిరాజ్ ప్రతి ఒక్కరికీ మానవ దృక్పథంలో తనవంతు సాకారం చేస్తూనే ఉంటారు. అటు ఆర్టీఐ సంస్థతో విధ్యారులకు విద్య పరంగా, ప్రజలకు, మహిళలకు అనేక రంగాల్లో సహాయాలు అందిస్తున్నారు. ఇవన్నీ గమనించిన డే స్ప్రింగ్ థియోలాజికల్ యూనివర్సిటీ టెక్సాస్ యు.ఎస్.ఎ విశ్లేషకులు దాదాపు 3 సం"లు విశ్లేషించి గౌరవప్రదంగా ఆయనకి డాక్టరేట్ పట్టాకు సరైన అర్హుడని ప్రకటించారు హైదరాబాద్ లో ఏర్పాటు చేసిన స్నాతకోత్సవం పట్టాభిషేకం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన సేవలను గుర్తించి డాక్టరేట్ ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందని ఆయన అన్నారు. ఈ అవార్డు పొందడం పట్ల ఆయన అభిమానులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వరప్రసాద్,ఆర్టీఐ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సురాస్రవంతి,కిషోర్ వర్మ,సృజన,గుండెల రాయుడు తదితరులు పాల్గొన్నారు.

# నిండుకుండలా చెరువులు

-అలుగు పారుతున్న చెరువులు



**అక్షర విజేత కొండపాక** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు గ్రామాలన్నీ జలమయ మయ్యాయి. పలు గ్రామాల రోడ్లు తెగిపోయాయి.

పలు ఇండ్లు పాక్షికంగా దెబ్బ తిన్నాయి. పలు గ్రామాల్లోని చెరువులు నిండి ఆలుగు పారుతున్నాయి.మండలంలోని దుద్దెడ ,బందారం, అంకిరెడ్డి పల్లి,సిర్సనగండ్ల దమ్మక్కపల్లి తదితర గ్రామాల్లోని చెరువులు మత్తడి ఆలుగు పారుతున్నాయి.ఏనాడు నిండని చేరువుల్లోకి సైతం నీరు రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

కుక్కునూరు పల్లిమండలంలో కుకునూరుపల్లి మండల పరిధిలోని లకుడారం. కుకునూరు పెల్లి. మంగోల్. మేది నీ పూర్. తిప్పారం. చిన్న కిష్టాపూర్. రామచంద్రపురం తదితర గ్రామాలలోని చెరువులు నిండిమత్తడిపారడం తో రైతులు హర్షం వ్యక్తం చేశారు

# తండ్రీ కూతురుని మింగిన ఆకేరు వాగు



**అక్షర విజేత మరిపెడ:-** తండ్రీ కూతురుని మింగిన ఆకేరు వాగు పురుషోత్తమాయగూడెం వద్ద ఆకేరు వాగులో గల్లంతైన నూనావత్ మోతీలాల్ మృతదేహం లభ్యమైంది. ఆదివారం ఉదయం వాగులో కారు కొట్టుకుపోయిన ఘటనలో తండ్రీకూతురు గల్లంతైన విషయం తెలిసిందే. సాయంత్రం బిడ్డ అశ్విని మృతదేహం లభ్యంకాగా, సోమవారం తండ్రి మోతీలాల్ మృతదేహాన్ని రెస్క్యూ టీం గుర్తించారు. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం కాగా, స్థానికులను కంటతడిపెట్టించింది.

# ధ్వంసమైన రోడ్లు

**-పలు గ్రామాలకు నిలిచిపోయిన రాకపోకలు**



**అక్షర విజేత కొండపాక** వరుసగా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాల రోడ్లు ధ్వంసమయ్యాయి. బందారం గ్రామంలో రోడ్డు మరమ్మత్తు పనులు మధ్యలో నిలిచి పోవడంతో వర్షానికి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. బందారంలో ఇండ్లలోకి నీరు రాకుండా జెసిబి తో కాలువ చేశారు. దుద్దెడ నుంచి దర్గా వెళ్లే రోడ్డు కోతకు గురైన రోడ్డు ప్రమాదకరంగామారింది. దుద్దెడ నుంచి బంధారం కి వెళ్లే రోడ్డు తెగిపోయింది. రోడ్డు తెగిపోవడం వల్ల ప్రజలు ఇబ్బందులు గురవుతున్నారు సంబంధిత అధికారులు వెంటనే మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుచున్నారు

# రాంనగర్ బ్రిడ్జి నిర్మాణానికి మోక్షం ఎప్పుడు??



**అక్షర విజేత, మంచిర్యాల ప్రతినిధి:** బెల్లంపల్లి పట్టణంలోని హనుమాన్ బస్తీ- రాంనగర్, అశోక్ నగర్ లను కలిపి ఉంచే రాంనగర్ బ్రిడ్జిపై నుండి గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంది. దీంతో హనుమాన్ బస్తి నుండి రాంనగర్, రాంనగర్ నుండి బజార్ కి రాకపోకలు నిలిచిపోయాయి. బ్రిడ్జి పై నుండి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బ్రిడ్జిని ఆనుకొని ఉన్న 33వ వార్డులోని పలు ఇండ్లలోకి వరద నీరు చేరి వార్డు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరదతో పాటు పాములు, తేళ్లు వంటి విష ప్రాణులు ఇండ్లలోకి వస్తున్నాయని వారు భయాందోళనకు గురవుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే తమకు తిప్పలు తప్పడం లేదని ప్రజలు వాపోయారు. గతంలో అనేకసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకోగా నూతన బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు అయినట్లు ప్రకటించడం జరిగిందని అన్నారు. నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్న ఇంతవరకు బ్రిడ్జి నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టిన పాపాన పోలేదని మున్సిపల్ పాలకవర్గంపై వారు మండిపడ్డారు. ప్రతి ఏడాది తాము పడుతున్న ఇబ్బందులు చూస్తూ సైతం బ్రిడ్జి నిర్మించకపోవడం దారుణం అన్నారు. ఇళ్లలోకి నీరు చేరి ఇబ్బందులు పడుతున్న పలు కుటుంబాలను సోమవారం వార్డు కౌన్సిలర్ పోలు ఉమాదేవి-శ్రీనివాసులు వెళ్లి సందర్శించారు. బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించడానికి మున్సిపల్ చైర్ పర్సన్, స్థానిక ఎమ్మెల్యేలను కలిసి మరోసారి విన్నవిస్తానని, త్వరలోనే బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించడానికి కృషి చేస్తానని తెలిపారు.

# గోదావరి వరద ప్రవాహాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

**– ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించిన కలెక్టర్**



**అక్షర విజేత జయశంకర్ భూపాలపల్లి ప్రతినిది:** ముంపు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులకు సూచించారు. సోమవారం మహదేవ్ పూర్ మండలం కాళేశ్వరం వద్ద గోదావరి ఉధృతిని అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ముంపు ప్రాంతమైన పుసుకు పల్లి గ్రామాన్ని సందర్శించి గ్రామస్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచనల మేరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉదృతంగా ప్రవహిస్తున్నదని, గోదావరి పరివాహక ప్రాంత ప్రజలను ముంపు గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు. పునరావాస కేంద్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉండాలని అన్నారు.

ఎగువ ప్రాంతాలలో వర్షం కురిస్తే గోదావరి ఉదృతంగా ప్రవహించే అవకాశం ఉంటుందని, ముంపు ప్రాంతల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు సమాచారాన్ని తనకు తెలియా పరచాలని అన్నారు. గోదావరిలోకి స్నానాలు ఆచరించేందుకు భక్తులను అనుమతించ కుండా జాగ్రత్తలు తీసుకోవాలని, గజ ఈత గాళ్లను అందుబాటులో ఉంచాలని అధికారులను జిల్లా కలెక్టరు ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వీరభద్రయ్య, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, తహసిల్దార్ రాథోడ్ ప్రహ్లాద్, ఇరిగేషన్ డిప్యూటీ ఇంజనీర్ సూర్య ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, సిడబ్ల్యుసి సైట్ ఇంజనీర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# గణపతి నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**అక్షర విజేత జయశంకర్ భూపాలపల్లి ప్రతినిది:** గణపతి నవరాత్రి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం ఐడిఒసి కార్యాలయపు కాన్ఫరెన్స్ హాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహణపై పోలీస్, రెవెన్యూ, పంచాయితి రాజ్, విద్యుత్, మున్సిపాల్టీ, మత్స్యశాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి గణపతి నవరాత్రి ఉత్సవాలకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని తెలిపారు. గణపతి నిమజ్జనం జరిగే చెరువులు, వాగులు, గోదావరి నది వద్ద పోలీస్ శాఖ తరుపున పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. పంచాయితీ రాజ్ శాఖ ద్వారా పారిశుద్ధ్య కార్యక్రమాలు, త్రాగునీరు ఏర్పాటు చేయాలని అన్నారు. అవసరం మేరకు తాత్కాలిక సిబ్బందిని నియమించాలని పేర్కొన్నారు. మత్స్య శాఖ ద్వారా గజ ఈత గాళ్ళను ఏర్పాటు చేయాలని అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా అంబులెన్స్, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యుత్ శాఖ ద్వారా గణపతి మండపాలకు విద్యుత్ అనుమతులు జారీ చేయాలని, విద్యుత్ తీగలు కింద, విద్యుత్ స్తంభాలు ప్రక్కన మండ్పాలను ఏర్పాటు చేయకుండా నియంత్రణ చేయాలని అన్నారు. రెవెన్యూ, పంచాయితి కార్యదర్శుల ద్వారా గ్రామ స్థాయిలో ప్రజలకు గణపతి నవరాత్రి ఉత్సవాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని తెలిపారు. కాళేశ్వరం గోదావరి వద్ద వినాయక ప్రతిమలు నిమజ్జనం జరిగే చోట క్రేన్ లు ఏర్పాటు చేసి ట్రాఫిక్ సమస్య రాకుండా చూడాలని అన్నారు. మండపాల నిర్వాహకులకు నిమజ్జన ప్రక్రియపై అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లాలో గణపతి నవరాత్రి ఉత్సవాలు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించుటకు ప్రజలు అధికారులకు సహకరించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. మండపాల వద్ద ప్లాస్టిక్ వినియోగించకుండా ఉండేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. వ్యర్థాలు వేసేందుకు తప్పని సరిగా డస్ట్ బిన్స్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు.

ఈ సమావేశంలో జడ్పీ సీఈవో విజయలక్ష్మి, డీపీఓ నారాయణరావు, మత్స్య శాఖ అధికారి అవినాష్, అదనపు ఎస్పి బోనాల కిషన్, ఆర్డీవో మంగిలాల్, డిఎస్పీలు, సిఐలు, తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లు కూలిన బాధితులకు సహాయం



**అక్షర విజేత వాజేడు** ములుగు జిల్లా వెంకటాపురం మండలం చిరుత పల్లి గ్రామానికి చెందిన అట్టం కృష్ణమూర్తి వృద్ద దంపతులు ఇల్లు ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా ఇల్లు కూలిపోవడం జరిగింది. బర్లగూడెం మాజీ సర్పంచ్ కొరుస నరసింహమూర్తి ద్వారా విషయం తెలుసుకున్న చేయూత స్వచ్ఛంద సేవ సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాష్,ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వారితో మాట్లాడి గిన్నెలు సెట్ ఒకటి ,బరకం దాతల సహకారంతో 25 కేజీ బియ్యం చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు చిడెం సాయి ప్రకాష్ దాతల సహకారంతో పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బార్లగూడెం మాజీ సర్పంచ్ కోర్స నరసింహమూర్తి,బట్టి విజయ్, గూటం రాధా కృష్ణ కొప్పుల వినోద్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి అధికారుల చర్యలు తీసుకోవాలి : జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ



**అక్షర విజేత జయశంకర్ భూపాలపల్లి ప్రతినిది:** ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. సోమవారం సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్ లో ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి వినతులు స్వీకరించి సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ

జిల్లా వ్యాప్తంగా పలు సమస్యలతో కూడిన 17 దరఖాస్తులు ప్రజావాణిలో వచ్చాయని తెలిపారు. వచ్చిన ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత శాఖలు పరిష్కరించేందుకు ఎండార్స్మెంట్ చేసినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి నుండి జిల్లాకి సంబంధించి వచ్చిన ప్రజావాణి దరఖాస్తులు అలాగే జిల్లాస్థాయిలో వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తులు పరిష్కారానికి ప్రతి శాఖలో ప్రత్యేకంగా నోడల్ అధికారులు నియమించాలని, దరఖాస్తు పరిష్కార వివరాలు వెబ్ సైట్ లో అప్లోడ్ చేయాలని సూచించారు.

మండల స్థాయిలో ప్రతి తహసిల్దార్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహిస్తున్నామని, మండల పరిధిలోని సమస్య అయితే సంబంధిత తహసీల్దార్ కార్యాలయంలో దరఖాస్తులు చేయాలని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో విజయలక్ష్మి, ఆర్డీవో మంగిలాల్, ఈ.డి.ఎం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# నిషేధిత గుట్కా, జర్దా ప్యాకెట్లు పట్టివేత

**అక్షర విజేత /మరికల్/ ధన్వాడ:** నారాయణపేట జిల్లా మరికల్ మండలం పెద్ద చింతకుంట గ్రామ శివారులో సోమవారం కారులో తరలిస్తున్న నిషేధిత గుట్కా, జర్ధా ప్యాకెట్లు పట్టుకున్నట్లు మరికల్ ఎస్సై మురళి తెలిపారు. మహబూబ్ నగర్ నుండి చిత్తనూరు గ్రామానికి కారులో గుట్కా ప్యాకెట్లు తరలిస్తున్నారని అందిన సమాచారం మేరకు దాడులు చేసి పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. రూపాయలు 98,505 వేల విలువ గల గుట్కా, జర్ధా ప్యాకెట్లను సీజ్ చేసి మరికల్ పోలీస్ స్టేషన్ కు తరలించి ఏలూరు నూతన్ పైన కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు మరికల్ ఎస్సై మురళి తెలిపారు.



# తెలంగాణ రాష్ట్రంలో సమగ్ర కుల గణన వెంటనే చేపట్టాలని ఆర్డీవో కు వినతిపత్రం

## -బీసీ సంఘం నాయకులు డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్



**అక్షర విజేత నర్సంపేట /** తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సంపేట నియోజకవర్గం ఇన్చార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ ఆధ్వర్యంలో బీసీ కుల సంఘాల నాయకులతో కలిసి నర్సంపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్రంలో కుల గణన చేపట్టి ప్రభుత్వం స్థానిక సంస్థల రిజర్వేషన్లు 42% శాతం బీసీలకు పెంచాలని వినతి పత్రాన్ని ఏఓ శ్రీనివాస్ కు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీసీ లు అత్యధిక జనాభా ఉన్నా రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, వెనుకబడిన బీసీ లను గుర్తించాలని అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీల లెక్కలు తేల్చాలని మేము ఎంతో ఉన్నామో మా లెక్కలు లెక్కించాలని రెవెన్యూ డివిజన్ కార్యాలయం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేయడం జరిగిందని అన్నారు. జనాభా దామాషా ప్రకారం కుల గణన చేపట్టి 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ 2023 ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారంలో భాగంగా కామారెడ్డి సభ వేదికగా కాంగ్రెస్ పార్టీ అధినేత రాహుల్ గాంధీ తమ ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరచడం జరిగిందని అన్నారని అన్నారు. జనవరిలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఢిల్లీలో రాహుల్ గాంధీని కలవడం జరిగిందని అదే సమయంలో రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసిన తర్వాత ఫిబ్రవరిలో జరిగిన అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో అసెంబ్లీ బిల్లు పెట్టి ఏకగ్రీవ తీర్మానం చేసి జీవో నెంబర్ 26ను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తూ 150 కోట్ల బడ్జెట్ ను కూడా కేటాయించిందని ఇప్పుడున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పడం జరిగిందని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారమే బీసీలకు స్థానిక సంస్థలలో 42% శాతం రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డ్యాగల శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనన్న ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని డ్యాగల శ్రీనివాస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కురిమిళ్ల రమేష్ చారి, బండారి సుమంత్, గోపగాని శోభన్ బాబు దూపటి సుమన్ బీసీ నాయకులు ఆబోతు రాజు యాదవ్, మచ్చిక రాజు గౌడ్, పట్టణ ఉపాధ్యక్షులు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్, కార్యదర్శి ఓడపెల్లి రమేష్, కొమ్మ శ్రీకాంత్, గాండ్ల శ్రీనివాస్, మర్రి క్రాంతి కుమార్, కొలిపాక సుధాకర్, మడూరి సుభాష్ గౌడ్, బేతి భాస్కర్, శీరంశెట్టి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# బాలవికాస అధ్వర్యంలో కాఫేడ్ వారి సహకారంతో చేతి పంపులు ఏర్పాటు



**అక్షర విజేత వాజేడు** ములుగు జిల్లా వాజేడు మండలంలోని బాల వికాస స్వచ్ఛంద సంస్థ వరంగల్ మరియు కాఫేడ్ స్వచ్ఛంద సంస్థ వెంకటాపురం వారి సంయుక్త అధ్వర్యంలో సోమవారం వాజేడు మండలం ఘణపురం,కొప్పుసూరు,మాస్ కాలనీ గ్రామాలకు బోర్ వేల్ వేయడం జరిగింది. మారుమూల గ్రామాలలో నీటి సమస్యల తో ఇబ్బంది పడుతున్న గ్రామాలను గుర్తించి కాఫేడ్ సంస్థ వారు బాలవికాస వారికి తెలియ చేయటం జరిగింది. బాలవికాస కోఆర్డినేటర్ ప్రశాంత్ మాట్లాడుతూ కెనడా దేశం లోని పేరన్ వుడ్ పాఠశాల విద్యార్థుల సహకరం తో ఈ బోర్ వేల్ వేయడం జరిగింది అని తెలియ చేసారు. గ్రామస్తులు కాఫేడ్ స్వచ్ఛంద సంస్థ వారికి బాల వికాస స్వచ్ఛంద సంస్థ వారికి ధన్యవాదాలు తెలియ చేయటం జరిగింది. ఈ కార్యక్రమానికి బాలవికాస సంస్థ కోఆర్డినేటర్ ప్రశాంత్,కాఫేడ్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ లూర్దు రాజు వాజేడు మండల కోఆర్డినేటర్ జి కామేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అద్వాన స్థితిలో లింబూర్-వాడి రోడ్డు

## -అత్యవసర పరిస్థితులలో మరణమే శరణం



**అక్షర విజేత జుక్కల్ ప్రతినిధి** కామారెడ్డి జిల్లా మద్నూర్ మండలంలోని లింబూర్ నుండి వాడికి గ్రామానికి వెళ్లే రోడ్డు అద్వాన పరిస్థితిలో ఉంది. గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్డు మొత్తం బురద నీటితో నిండి రాకపోకలు సాగించడానికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం పడితే బైక్ వెళ్లే పరిస్థితి లేక,బురదలో కాలినడకన వెళ్లాలన్నారు. అత్యవసర పరిస్థితి ఏర్పడితే ఇతర గ్రామానికి వెళ్లడానికి రోడ్డు లేక ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని గ్రామస్తులు తమ ఆవేదన వ్యక్తం చేశారు.చాలా సంవత్సరాల నుండి తమ గ్రామానికి రోడ్డు మార్గం లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ప్రభుత్వాలు, ఎమ్మెల్యేలు మారిన తమ సమస్యను ఎవరు పరిష్కరించడం లేదన్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు వచ్చి రోడ్డు వేస్తానని వాగ్దానాలు చేస్తున్నారు తప్ప రోడ్డు వేయడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు అధికారులు స్పందించి తమ గ్రామానికి నూతన బీటీ రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

# అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిన ఎమ్మెల్యే వెంకట్రాజు



**గోపాలపురం మండలం అక్షర విజేత**, అభివృద్ధి లక్ష్యం అన్న ఎమ్మెల్యే మద్దిపాడు వెంకటరాజు అన్నారు. సోమవారం మండలంలోని శ్రీ లక్ష్మీ గణపతి గౌడ్ సంఘం ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు అన్నమా, రెడ్డి సుబ్బారావు గారు గౌడ్ సంగం కమ్యూనిటీ హాల్ పున నిర్మించిన కమ్యూనిటీ హాల్ కు లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. కమ్యూటీ హాల్ ఎమ్మెల్యే వెంకట్రాజ్ ప్రారంభించారు. ముందుగా తీన్మార్ తో పూలమాలతో ఘన స్వాగతం పలికారు. స్థానిక ఉప్పరగూడెంలో ఎంపీపీ ఎలిమెంటరీ స్కూల్ ప్రహరీ గోడ నిర్మాణానికి 14 లక్షల రూపాయలు మంజూరు చేస్తూ, ఎమ్మెల్యే మద్దిపాడు వెంకటరాజు భూమి పూజ చేశారు. తెలుగుదేశం గ్రామ కమిటీ అధ్యక్షుడులు జాస్టర్ శ్రీధర్ తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు బురెడ్డి వాసు ఆర్థిక సౌజన్యంతో సుమారు 50 కుర్చీలను ఆయా సంఘాల నాయకులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ పేద బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తుందని, గోపాలపురం నియోజకవర్గం హెడ్ క్వార్టర్ అయినా ఆర్థికంగా వెనుకబడిందని ఉందని, గోపాలపురం అభివృద్ధికి కోటి రూపాయలు నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని గోపాలపురాన్ని అధర్మ గ్రామంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు, ప్రజలందరూ తెలుగుదేశం పార్టీ వెన్నుదన్నుగా ఉండి బలోపేతాన్ని కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రంగుల సత్యనారాయణ ఎడ్లమూడి రమేష్, కొర్లపాటి రాము, గద్దె హరిబాబు , కొర్లపాటి అన్నవరం, పడమటి, శ్రీను ఎక్స్ ఎంపీటీసీ కోనకుం ప్రసాద్, వాసు, కే గంగరాజు, నూతంగి దొరబాబు, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేసముద్రం స్టేషన్ వద్ద చెదిరిపోయిన రైలు పట్టాలు

## -స్టేషన్లోనే ఇరుక్కున్న రైలు ప్రయాణికులు
## -రంగంలోకి దిగిన సికింద్రాబాద్ డివిజన్ రైల్వే రక్షణ దళం
## -సహాయక చర్యలు చేపట్టిన వికారాబాద్ ఆర్పిఎఫ్ ఇన్స్పెక్టర్ రాజేంద్ర ప్రసాద్





**అక్షరవిజేత, వికారాబాద్ ప్రతినిధి** భారీ వర్షాల కారణంగా పలుచోట్ల రైలు పట్టాలపై నీళ్లు నిలిచిపోవటం కారణంగా సికింద్రాబాద్ డివిజన్లో అనేక చోట్ల రైళ్ల రాకపోకలకు అంతరాయం కలిగింది. వికారాబాద్ డివిజన్ కి సంబంధించిన ప్రాంతంలో అలాంటి సంఘటన చోటు చేసుకోవడం వలన వికారాబాద్ వైపుగా వెళ్లాల్సిన కొన్ని రైళ్లకు అంతరాయం కలిగింది. అలాంటి రైళ్ళను క్యాన్సల్ కూడా చేయడం జరిగిందిమెహబూబాబాద్ - వరంగల్ మధ్యన కేసముద్రం అనే ఒక స్టేషన్ ఉంది. భారీ వర్షం కారణంగా ఆ స్టేషన్కు సమీపంలో ఇరువైపులా రైలు పట్టాలు ఎక్కడికక్కడ చెదిరిపో యాయి. దీంతో రెండు రైళ్లకు సంబంధించిన ప్రయాణికులు అదే స్టేషన్లో చిక్కుకోవడం జరిగింది. సుమారు ఆరు వేల మంది ప్రయాణికులు ఆ చిన్న స్టేషన్లో చిక్కుకుపోయారు. కేసముద్రం స్టేషన్ చుట్టుపక్కల ప్రాంతాలు, గ్రామాలన్నీ నీట మునిగి ఉండడం, కల్వర్టులు ప్రాంతాలలో నీరు పెద్ద ఎత్తున ప్రవహించడంతో ఆ ప్రయాణికులకు సహాయక చర్యలు చేపట్టేందుకు, బస్సులో, ఇతర వాహనాలలో గాని ఆ ప్రదేశాన్ని చేరుకోవడం అసాధ్యంగా మారింది. సత్వరమే రంగంలోకి దిగిన సికింద్రాబాద్ డివిజన్ రైల్వే రక్షణ దళం పోలీసులు తమ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ దేభాశ్మిత బెనర్జీ ఆదేశాల మేరకు వికారాబాద్ డివిజన్ ఇన్స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక బృందంగా ఏర్పడి ఆయన సూచనల మేరకు కొత్త దారిని అన్వేషించి కేసముద్రం స్టేషన్కు చేరుకున్నారు. అనంతరం ఇన్స్పెక్టర్ రాజేంద్రప్రసాద్ పోలీస్, ఆర్టీసీ, రెవెన్యూ యంత్రాంగాలతో సంప్రదింపులు జరిపి, ప్రయాణికులకు సహాయక చర్యలు చేపట్టారు. సుమారు 72 బస్సులను కేసముద్రం రైల్వే స్టేషన్ కు రప్పించి అక్కడున్న సుమారు 6000 ప్రయాణికులను, ప్రజలను సురక్షితంగా అక్కడినుండి వారి గమ్య స్థానాలకు తరలించారు. ఈ క్రమంలో చిన్నపిల్లలని, పిల్లలు ఉన్నవారిని, స్త్రీలను, అనారోగ్యం కారణంగా అవస్థలు ఉన్నవారి పట్ల ప్రత్యేక శ్రద్ధలు వహించి వారికి కావలసిన నిత్యవసర వస్తువులు, మందులు, వీల్ చైర్లు సమకూర్చడంతో పాటు వారికి ఆహారం మంచినీటిని సమృద్ధిగా అందించారు. ఎవరికి అపాయం తలెత్తకుండా ఆర్పిఎఫ్ అనగా రైల్వే రక్షణ దళం పోలీసులు విరోచిత సేవలు అందించి ప్రజల మన్ననలు ప్రశంసలు పొందారు.

# గోదావరి నది తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## – స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.గౌతమ్ రెడ్డి



**అక్షర విజేత, రాయికల్:** భారీగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో బోర్నపెల్లి గోదావరి నదిని సందర్శించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి.గౌతంరెడ్డి భారీ వర్షాల కురిసిన నేపథ్యంలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు మరియు కడెం ప్రాజెక్టులనుండి దిగువకు నీటిని విడుదల చేయడం వలన, ఆ నీరు గోదావరి నదిలో కలిసి ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి ని పరిశీలించారు. నది ప్రవాహక ప్రజలతో అడిషనల్ కలెక్టర్ మాట్లాడి పరిస్థితిని సమీక్షించారు. గోదావరి నది పరివాహక ప్రాంతమైన కుర్రు గ్రామం నుండి 5 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం జరిగిందని స్థానిక గ్రామస్తులు అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి కి తెలిపారు. ఆయన లోయగూడెం గ్రామ పరిస్థితిని అక్కడ ఉన్న స్థానికులతో తెలుసుకున్నారు, మండలంలోని లోతట్టు ప్రాంతాలు, కల్వర్టులు, వర్షాలకు శిథిలావస్థలో ఉన్న గృహాలను, కూలిన ఇండ్లను రాయికల్ తహసిల్దార్, మండల అభివృద్ధి అధికారిని, నీటిపారుదల శాఖ డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ లను అడిగి తెలుసుకున్నారు. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు, కడెం ప్రాజెక్టుల నీటిని విడుదల చేయడం వల్ల గోదావరి నది తీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు ఆ ప్రాంత ప్రజల, గ్రామాల సమాచారం ఎప్పటికప్పుడు తెలుసుకొని తగు సహాయక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంట రాయికల్ తహసిల్దార్ అబ్దుల్ ఖయ్యూం, ఎం.పీ.డీ.వో చిరంజీవి, నీటిపారుదలశాఖ ఇంజనీర్లు తదితర అధికారులు ఉన్నారు.

# బి ఆర్ ఎస్ తప్పుడు ప్రచారాలు ప్రజలు నమ్మరు

## -కాంగ్రెస్ పార్టీ మండలఅధ్యక్షులు తిరుపతి రెడ్డి



**అక్షర విజేత నర్సంపేట/** నల్లబెల్లి మండల కాంగ్రెస్ కార్యాలయంలో జరిగిన పత్రిక సమావేశంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిట్యాల తిరుపతి రెడ్డి మాట్లాడుతూ దేవాదుల ప్రాజెక్ట్ సమీక్ష సమావేశం లో నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి గారు దేవాదుల ప్రాజెక్ట్ లో భాగంగా చేపట్టిన రంగయ్య చెరువు ద్వారా 36000 ఎకరాల ఆయకట్టు కి సాగునీరు అందించే కార్యక్రమంలో భాగంగా నిర్మించిన కాలువ నిర్మాణం పనులు నాలుగేండ్లుగా నత్తనడకన సాగుతున్న క్రమంలో పూర్తి ఆయకట్టు కి నీళ్లు అందించడానికి కాలువల నిర్మాణ పనులు తొందరగా పూర్తి చేయించాలని అందుకు నిధులు కూడా త్వరగా మంజూరు చేయాలనీ కోరడం జరిగింది. ఇట్టి విషయాన్నీ వక్రీకరించి శవ రాజకీయాలకి చిల్లర రాజకీయాలకి చౌకబారు రాజకీయాలకి అలవాటు పడిన బి ఆర్ ఎస్ పార్టీకి చెందిన కొంత మంది ఎమ్మెల్యే దిష్టిబొమ్మలు దగ్ధం చేస్తూ రంగాయ చెరువు పరిసర గ్రామాల ప్రజలలో అపోహ సృష్టించి వారిని భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవ రెడ్డి ఆదేసాను సారంగా పత్రిక సమావేశం ద్వారా రంగాయ చెరువు పరిసర గ్రామాల ప్రజలకి తెలియ జేయునది ఏమనగా రంగాయ చెరువు రిజర్వాయర్ పునర్ నిర్మాణం చేయించే ఉద్దేశ్యం ప్రభుత్వానికి లేదని,రంగాయ చెరువు కాలువల నిర్మాణం ద్వారా పూర్తి ఆయకట్టు కి సాగునీరు అందించడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని,ఒక్క ఇల్లు మునిగిన,ఒక్క ఎకరం భూమి మునిగిన స్థానిక శాసన సభ్యుడిగా నాదే పూర్తి భాద్యత అని ఎమ్మెల్యే హామీ ఇవ్వడం జరిగింది అలాగే రంగాయ చెరువు పరిసర గ్రామాల ప్రజలు కూడా చిల్లర,చౌకబారు రాజకీయాలకి పాల్పడే వ్యక్తులు ప్రచారం చేసే తప్పుడు వార్తల్ని నమ్మి భయాందోళనలకి గురి కావద్దని కోరడం జరిగింది..

ఈ పత్రిక సమావేశంలో మాజీ ఎంపీటీసీ జిల్లా మునిందర్,ఏడాకుల సంపత్ రెడ్డి ,మాలోతు చరణ్ సింగ్ ,పురుషోత్తం సురేష్ ,కర్దురి కట్టయ్య జెట్టి రాంమూర్తి ,బత్తిని మల్లయ్య ,బత్తిని మహేష్ ,పెంతల కొమురా రెడ్డి,గుండాల రాజా కొమురయ్య తదితరులు పాల్గొన్నారు

# సినిమా పోస్టర్ ను ఆవిష్కరించిన - రాణా ప్రతాప్ రెడ్డి



**అక్షర విజేత నర్సంపేట/** నర్సంపేట పట్టణానికి చెందిన మిత్రుడు ఉమపరమేశ్వర్ దర్శకత్వంలో, ప్రొడ్యూసర్ గా ఎడ్ల రవితేజ కాంబినేషన్ లో నిర్మించిన చిత్రం లాస్ట్ డ్రైవ్ విత్ ఫస్ట్ క్రష్ సినిమా పోస్టర్ ను ఆవిష్కరించిన భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా గోగుల రాణా ప్రతాప్ రెడ్డి

ఈ సందర్భంగా రాణా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ ఎంతో మంది యువకులలో అనేక రంగాలలో టాలెంట్ ఉన్నా, వారిని ప్రోత్సహించే వారు లేక వారి టాలెంట్ బయటికి రావడం లేదు. నర్సంపేట నియోజకవర్గంలో ఎవరికైతే ఏ రంగంలో టాలెంట్ ఉందో వారిని ప్రోత్సహించి వారికి అండగా ఉంటామని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది.

# జన నాయకుడికి ఘన నివాళులు

## –కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన సేవలు మరువలేనివి



**అక్షర విజేత జుక్కల్ ప్రతినిధి** అపర భగీరథుడు,రైతు బాంధవుడు, ఆరోగ్యశ్రీ ప్రధాత, పేద బడుగు బలహీన వర్గాల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు వైయస్ రాజశేఖర్ రెడ్డి వర్ధంతి సందర్భంగా మద్నూర్ మండల కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్రపటానికి పూలమానులు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఒక మహా నాయకుడిని కోల్పోయిందని, కాంగ్రెస్ పార్టీకి ఆయన చేసిన సేవలు మరువలేని తెలిపారు. ప్రతి ఒక్కరు ఆయన సేవలకు రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ధరాస్ సాయిలు, యూత్ అధ్యక్షులు తైదల్వార్ రవి, మాజీ ఎంపీపీ ప్రజ్ఞకుమార్ ,వట్నాల రమేష్,రాజ్ సేట్,చౌలవార్ హన్మండ్లు, రామ్ పటేల్,బండి వార్ గోపి,కర్రెవార్ రాములు, అమూల్,హన్మంత్ యాదవ్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ మున్సిపాలిటీ పై సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్

**-15 రోజుల్లో మున్సిపల్ టౌన్ లో జరుగుతున్న జాతీయ రహదారి.డ్రైనేజీ, విద్యుత్ స్థంబాల పనులు పూర్తి చేయాలి.**

**-మున్సిపాలిటీ పరిధిలో ఖాళీగా ఉన్న జాగల్లో నీటి నిల్వలు ఉన్న గడ్డి పొదలు ఉన్న నోటీసులు ఇస్తూ హెచ్చరికలు.**

**-జాతీయ రహదారి పనుల్లో మిగిలి ఉన్న ఎన్క్రోచ్ మెంట్ ఇళ్లు తొలగింపు చేసి రోడ్డు త్వరగా పూర్తి చేయాలి.**

**-నాళాల దగ్గర కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టిన వారికి హెచ్చరిస్తూ నోటీసులు.**

**-భారీ వర్షాలకు నియోజకవర్గంలో వివిధ గ్రామాల్లో దెబ్బతిన్న రోడ్ల వివరాలు ఇవ్వాలి.**

**-పొతారం నుండి హుస్నాబాద్ వచ్చే వరద నీరు పట్టణంలో వచ్చి షాపులు, ఇళ్లలోకి నీరు వస్తుండడంతో దానికి శాశ్వత చర్యలు.**



**అక్షర విజేత సిద్దిపేట** హుస్నాబాద్ పట్టణం నుండి వెళ్తున్న జాతీయ రహదారి పనులు ఆలస్యం పై మంత్రి పొన్నం ప్రభాకర్ అసహనం వ్యక్తం చేశారు. జాతీయ రహదారి పనులు ప్లానింగ్ ప్రకారం నిర్వహించకుండా అతుకుల బొంత లాగ సగం సగం పనులు చేస్తూ రోడ్డు నిర్మాణం పూర్తి చేయకపోవడం వల్ల పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. జాతీయ రహదారి పనుల్లో భాగంగా రేపు విద్యుత్ స్తంభాలు తొలగించి వేగంగా విద్యుత్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యుత్ పనులు పూర్తికాగానే డ్రైనేజీ వ్యవస్థ పూర్తి చేయాలని తెలిపారు.

పోతారం నుండి పట్టణంలోకి వచ్చే వరద నీరు డ్రైనేజీ లో సక్రమంగా వెళ్ళేలా ఇంజనీరింగ్ అధికారులు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రస్తుతం పట్టణంలో వ్యాపారస్తులకు ఇబ్బంది పెడుతున్న ప్రధాన సమస్య వరద నీరు అని దాని సమస్య పరిష్కారం లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వచ్చే 15 రోజుల్లో మున్సిపాలిటీ పరిధిలో రోడ్డు , డ్రైనేజీ వ్యవస్థ ,విద్యుత్ పనులు పూర్తి చేయాలని జాతీయ రహదారి ఇంజనీరింగ్ అధికారులకు డెడ్ లైన్ విధించారు. పట్టణంలో జాతీయ రహదారి పనులు జరిగే రోజుల్లో ట్రాఫిక్ డైవర్షన్ చేసి అటు పనులు వేగవంతం చేయడంతో పాటు పట్టణంలో ప్రజలకు వాహనదారులకు ఇబ్బందులు లేకుండా పోలీసులు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు.

ఇప్పటికే జాతీయ రహదారి పనులు గతంలో ఇచ్చిన ప్రొసీజర్ ప్రకారమే నడుస్తున్నాయని పనుల విషయంలో ఇప్పటికే మున్సిపల్ తీర్మానాన్ని నిర్వహించింది అని గుర్తు చేశారు. పనులు ఎవరు అడ్డుకున్న పోలీస్ భద్రతను ఏర్పాటు చేయాలని ఏసిపి కి ఆదేశించారు. జాతీయ రహదారి లో ఎన్క్రోచ్మెంట్ చేయాల్సిన ఇళ్ల కు 3 రోజుల సమయం ఇచ్చి కంప్లీట్ చేయాలని సూచించారు.

సమీక్షా సమావేశంలో హుస్నాబాద్ నియోజకవర్గంలో ఉన్న సిద్దిపేట జిల్లాకి చెందిన మూడు మండలాల పై కూడా చర్చించారు. భారీ వర్షాల వల్ల డెంగ్యూ ,మలేరియా ,చికెన్ గున్యా, టైఫాయిడ్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున వైద్యులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఎక్కడ వ్యాధి లక్షణాలు ఉన్న వెంటనే మంచి వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పట్టణంలో ఉన్న హాస్పిటల్ లో ఏ సమస్య ఉన్న తన దృష్టికి తీసుకురావాలని హాస్పిటల్ సుపరిండెంట్ కి సూచించారు. నీళ్ళు నిల్వ ఉండడం వల్లే వ్యాధులు వస్తున్నాయని పట్టణంలో అక్కడ చెట్లు కొట్టకుండా పొదలు ఉండి,నీరు నిల్వ ఉన్న ఖాళీ జాగల యజమానులకు , దాంతో పాటు నాళాల పై కబ్జా చేసి అక్రమ కట్టడాలు నిర్మించిన వారికి నోటీసులు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ ను ఆదేశించారు.

ఇల్లీగల్ గా నిర్మాణాలు చేపట్టిన వారికి అనుమతులు ఎవరు ఇచ్చారని ,ఇల్లీగల్ కట్టడాలను గుర్తించి వారికి నోటీసులు ఇవ్వాలని టౌన్ ప్లానింగ్ అధికారిని ఆదేశించారు. వారి వద్ద నుండి టాక్స్ వసూలు చేయాలన్నారు. కొత్త చెరువు నుండి అలుగు పొంగి పట్టా భూమి కలిగిన రైతుల పొలాల నుండి వెళ్ళడం వల్ల రైతులకు నష్టం జరుగుతుందని దానిని కాలువ ద్వారా డైవర్ట్ చేయడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

హుస్నాబాద్ పట్టణంలోని నియోజకవర్గంలో ఏ గ్రామంలో కూడా విద్యుత్ సమస్యలు ఉండకుండా చూసుకోవాలని విద్యుత్ అధికారులకు సూచించారు. వర్షాలకు హుస్నాబాద్ ఆర్టీసి డిపో గోడ కూలడంతో పక్కన ఉన్న ఇళ్ళకి ప్రమాదం తప్పిందని ఆగోడ త్వరగా నిర్మించుకొని ఇతరులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఆర్టీసి డీఎం కి సూచించారు. నిన్నటి వర్షాలకు అక్కన్నపేట మండలంలో రోడ్లు బాగా దెబ్బతిన్నాయని పంచాయతీ రాజ్ ఆర్ అండ్ బి అధికారులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు.

నియోజకవర్గంలో ఎక్కడెక్కడ రోడ్లు,కల్వర్టు లు , మినీ బ్రిడ్జీలు దెబ్బతిన్నాయో వివరాలు ఇవ్వాలని సూచించారు. ప్రతి గ్రామంలో రోడ్ల మలుపుల వద్ద చెట్లు పొదలు లేకుండా క్లియర్ చేయాలని పంచాయతీ సెక్రటరీ ల ద్వారా ఎక్కడెక్కడ ఉన్నయో వివరాలు సేకరించాలని ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో గ్రామాల్లో శానిటేషన్ ,స్ప్రేయింగ్ పనులు వేగంగా చేయాలని సూచించారు.

హుస్నాబాద్ డిగ్రీ కాలేజి కి వరద నీటిలో మునిగిందని తన దృష్టికి వచ్చిందని దానికి ముందున్న స్మశాన వాటిక దగ్గర నీళ్ళు వెళ్ళేలా క్లియర్ చేస్తే డిగ్రీ కాలేజి ముంపు పరిష్కారం అవుతుందని వెల్లడించారు. బస్వాపూర్ దగ్గర వరద నీరు వస్తుండడంతో ప్రస్తుతం సిద్దిపేట హుస్నాబాద్ రాకపోకలు నిలిచిపోయాయని అక్కడ నిర్మిస్తున్న బ్రిడ్జి వారం త్వరగా అందుబాటులోకి తేవాలని జాతీయ రహదారి అధికారులకు ఆదేశించారు.

సమీక్షా సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత వెంకన్న, వైస్ చైర్మన్ అనిత, కౌన్సిలర్లు. ఏసిపి, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్,ఇరిగేషన్ డీఈ ,ఈఈ లు , నేషనల్ హైవేస్ డీఈ ,ఆర్ అండ్ బి డిఈ,పంచాయతీ రాజ్ డీఎల్పివో, ఎంపిడివో,ఎలక్ట్రిసిటీ డిఈ, ఏఈ , హాస్పిటల్ సుపరిండెంట్ తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల పట్ల నర్సంపేట నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## -దేశి సాయి కిరణ్ పటేల్ -నర్సంపేట పట్టణ యూత్ కార్యదర్శి



**అక్షర విజేత నర్సంపేట/** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో వరంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గ పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలందరూ అప్రమత్తం గా ఉండాలి,మరి ముఖ్యంగా లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి నాలాలు, మ్యాన్‌హోల్స్ దగ్గర జాగ్రత్త ఉండాలి.ఎట్టి పరిస్థితుల్లోనూ కరెంటు స్విచ్ బోర్డు లను పోల్స్ దగ్గరకు వెల్లీ తాకవద్దని చెరువులు వాగులను చూడడానికి బయటకి వచ్చి ప్రమాదాల బారిన పడవద్దని సెల్ఫీల పేరిట ప్రమాదం కొని తెచ్చుకోవద్దని దేశి సాయి పటేల్ అన్నారు. రానున్న రెండు, మూడు రోజుల్లో భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున నియోజకవర్గ ప్రజలు,చిన్న పిల్లలను బయటకు వెళ్ళకుండా చూడాలి. వరుసగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అవసరమైతే తప్ప బయటికి రావద్దు శిధిలావస్థలో ఉన్న ఇళ్లల్లో నివసించే ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రజలు అత్యవసరం అయితే తప్ప ఇళ్ళ నుండి బయటకు రావద్దు కోరారు

# లక్షల్లో ఆస్తి నష్టం

## -నీటి మయంగా మారిన వ్యాపార దుకాణాలు





**అక్షర విజేత : కేసముద్రం, మహబూబాబాద్ ప్రతినిధి** జిల్లాలోని కేసముద్రం మండలంలో ఎడతెరిపిలేని వర్షాల కారణంగా వరద ఉధృతి భారీగా పెరిగి వరద ప్రవాహం పలు కాలనీలతో పాటు వాణిజ్య సముదాయాలను వరదనీటిలో ముంచెత్తాయి, నీటిలో అపోలో మెడికల్ షాప్, పలు సెల్ వరల్డ్ షాపులు, పెస్టిసైడ్స్ షాపు, ఫ్యాన్సీ జనరల్ స్టోర్స్ నీట మునగడంతో భారీగా ఆస్తి నష్టం జరిగిందని షాప్ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మెడికల్ షాప్ లో సుమారు రెండు లక్షలు, పెస్టిసైడ్స్ షాపులో 20 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని తెలిపారు. సెల్ వరల్డ్ షాపులలో కూడా లక్షల్లో మొబైల్ ఫోన్లు ఎలక్ట్రానిక్ పరికరాలు పూర్తిగా నీట మునగడంతో అవి పనికిరాని వస్తువులుగా బయటపడేయడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఫ్యాన్సీ జనరల్ స్టోర్స్ లో ఇదే తరహాలో భారీగా ఆస్తి నష్టం వాటిల్లందని చాలా వస్తువులు మొత్తానికి అమ్మకానికి పనికిరాకుండా పోయాయని షాపు యజమానులు బోరున విలపిస్తున్నారు. ఇలాంటి పెను విపత్తులు ఎన్నడూ జరగలేదని మరలా ఇలాంటి వరద తాకిడికి గురికాకుండా అధికారులు నాళాలను పర్యవేక్షించి వరద తాకిడికి పలు దుకాణాలు గురికాకుండా కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# కస్తూరిబా స్కూల్లో నీటి సమస్యను తాత్కాలికంగా పరిష్కరించిన డిసిసి అధికార ప్రతినిధి



**అక్షర విజేత నర్సంపేట/** అశోక్ నగర్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికలగురుకుల విద్యాలయం లోగత రెండు రోజులుగ కురుస్తున్న వర్షాలకు మిషన్ భగీరథ నీళ్ళు ఆగిపోయి స్కూలులో గల బోర్లు కూడా రిపేరుకొచ్చి స్కూలులో 330 మంది బాలికలకు నీటి సమస్య ఏర్పడినంది ఇట్టి సమస్యను కస్తూర్బా స్కూల్ ఎస్ఓ మేనక వరంగల్ డిసిసి అధికార ప్రతినిధి నియోజకవర్గ కన్వీనర్ తక్కల్లపల్లి రవీందర్ రావు దృష్టికి తీసుకుపోగ నర్సంపేట నియోజకవర్గ ఏమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి కి ఫోను ద్వారా నీటి సమస్యను దృష్టికి తీసుకపోగా ఇట్టి సమస్యపై ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని కోరటం జరిగింది వెంటనే స్పందించి తక్కల్లపల్లి రవీందర్ రావు స్కూలును సందర్శించి గ్రామ కార్యదర్శిని పిలిపించి మాట్లాడి గ్రామపంచాయతీ ట్యాంకర్ ద్వారా స్కూల్లో మిషన్ భగీరథ నీరు వచ్చేవరకు ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయాలని సూచించి దగ్గరుండి ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయడం జరిగింది జరిగింది తాత్కాలికంగా నీటి సమస్యను పరిష్కరించడం జరిగింది.

ఈ కార్యక్రమలొ గ్రామ కమిటీ అధ్యక్షులు ఎల్ది శ్రీనువాస్ అయోధ్యనగర్ గ్రామ పార్టీ అధ్యక్షులు గుండ్ల యాకయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గట్టి సారంగపాణి, యూత్ కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు కుస మునీందర్ ఎస్ సి సెల్ గ్రామ అధ్యక్షులు జాడి వెంకటేష్ పేండ్లి రాజు కర్ల రాజేందర్ జోగ దేవేందర్ వేంపల్లి నరసయ్య రమణ కొమురయ్య తదితరులు పాల్గొనరు.

# సేవలో చేయడంలో ఈయనకు సాటి లేరు మరొక్కరు



**అక్షరవిజేత, వికారాబాద్ ప్రతినిధి** సహాయం, సహకారం చేయడంలో ఈయనకు ఎవరు సాటిరారు.ఇది ఈయనకే సాధ్యం ఏమాత్రం ఎక్కువ అని భావించకుండా చిన్న సమస్య, పెద్ద సమస్య ఏదైనా తన వంతు పనిచేయడం ఈయన నైజం.గత రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు కోట్ పల్లి ప్రాజెక్ట్ అలుగు ఉదృత్వంగా ప్రవహించడంతో సోమవారం మధ్యాహ్నం నాటికి తగ్గుముఖం పట్టింది.దీంతో రోడ్డుపై పారిన నీళ్లలో చెత్తా చెదారం కొట్టుకొని వచ్చి రోడ్డుపై ఉన్న స్తంభాలను తట్టుకొని నిలిచిపోయింది.దీంతో తనే స్వయంగా సోమవారం అక్కడ ఉన్న కంపచెట్లను తొలగించారు. దీంతో ఆయనను చూసిన యువకులు తలో చేయి వేసి సహాయం చేశారు.ఇదే కాదు ఎన్నో సందర్భాలలో ఎవరికీ చెప్తే ఏం లాభం అనుకుంటాడో ఏమో కానీ పనిచేస్తాడు.ఈయన ఓ ప్రజా నాయకులు వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఆయనే మహమ్మద్ లాల్ మొహమ్మద్. ఇది చూసిన ప్రజలు వాహనదారులు ఆయనను అభినందించారు.

# వరద ప్రభావిత ప్రాంతాలను పర్యటించిన మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్



**అక్షర విజేత మరిపెడ:-** అకేరు వాగు వరద ఉధృతికి మండలంలోని ఉల్లెపల్లి గ్రామంలో దాదాపు సగానికి పైగా వరదలో చిక్కుకొని ఇప్పుడిప్పుడే కోలుకుంటోందని, గ్రామంలో దాదాపు 250 కుటుంబాలు ఉండగా ప్రతి ఇల్లు వరద ప్రవాహానికి గురైందని జీవాలు పశువులు ఇంట్లోని గృహోపకరణాలు మొత్తంగా కట్టు బట్టలతో మిగిలారని వారికి నష్టపరిహారం అందించాలన్నారు. అదే విధంగా పంట నష్టం అంచనా వేసి రైతులను ఆదుకోవలని మాజీ మంత్రి డిఎస్ రెడ్యానాయక్ అన్నారు.వారి మహబూబాబాద్ జిల్లా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ గుడిపూడి నవీన్ రావు మాజీ ఓడిసిఎంఎస్ చైర్మన్ కుడితి మహేందర్ రెడ్డి తాళ్లపల్లి శ్రీనివాస్ గుడిపూడి శ్రీధర్ రావు ఉల్లిపల్లి మాజీ గ్రామ సర్పంచ్ చిరపోయిన ప్రభాకర్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, రైతులు, మండల మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రావణమాసం పూజలు

-ఘనంగా ఏకాంబర రామలింగేశ్వర స్వామి జాతర

-పాల్గొన్న ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి





**అక్షర విజేత, తాండూరు:** శ్రావణమాసం చివరి సోమ వారం సందర్భంగా తాండూరు నియోజక వర్గం లోని వివిధ ఆలయాల్లో జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. బషీరాబాద్ మండలం నీలపల్లీ ఏకాంబర రామలింగేశ్వర దేవాలయంలో జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ఏకాంబర రామలింగేశ్వరున్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్ .వెంకటేష్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి , కాంగ్రెస్ సీనియర్ నాయకులు అజయ్ ప్రసాద్, రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురుస్తున్న పరిస్థితిలో కూడా భారీ సంఖ్యలో భక్తులు జాతర ఉత్సవాల్లో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి తల్లిదండ్రులు విట్టల్ రెడ్డి, ప్రమోదిని దంపతులు కూడా ఏకాంబర రామలింగేశ్వర ని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పెద్దముల్ మండలం అటవీ ప్రాంతంలోని ఇందోల్ శివాలయంలో కూడా అంబు రామన్న జాతర ఉత్సవాలు ఘనంగా జరిగాయి. అలాగే తాండూరు మండలం అల్లపూర్, జినుగుర్తి గ్రామాలలో శ్రీశ్రీశ్రీ రామ లింగేశ్వర స్వామి దేవాలయాలలో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.

# వ్యాపారదారులకు కోర్టులో ఊరట

**-షాద్ నగర్ ఆర్టీసీకి కోర్టులో చుక్కెదురు..!**

**-ఆర్టీసీ వ్యాపార సముదాయ దుకాణాలపై స్టేటస్కో**

**-బాధితుల తరపున అండగా నిలిచిన షాద్ నగర్ న్యాయవాది కంచి రాజగోపాల్**

**-హర్షం వ్యక్తం చేస్తున్న వ్యాపార,దుకాణాదారులు.**






**అక్షరవిజేత, రంగారెడ్డి బ్యూరో:** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ప్రభుత్వ ఆర్టీసీ దుకాణ సముదాయ వివాదంపై స్థానిక జూనియర్ సివిల్ జడ్జ్ స్టేటస్కో విధించారు. దీంతో ఆర్టీసీ దుకాణ సముదాయంలో అద్దెకు ఉంటున్న వ్యాపారస్తులు యధావిధిగా తమ కార్యకలాపాలు కొనసాగించుకోవచ్చని తెలిపారు. తదుపరి ఉత్తర్వులు కోర్టు ఇచ్చేవరకు వ్యాపారస్తులకు ఊరట లభించిందని షాద్ నగర్ ప్రముఖ న్యాయవాది కంచి రాజగోపాల్ వివరించారు.షాద్ నగర్ ఆర్టీసీ వ్యాపార సముదాయంలో అద్దెకు ఉంటున్న వ్యాపారస్తులను ఆర్టీసీ అధికారులు ఇటీవలే షాపులు ఖాళీ చేయాల్సిందిగా ఆదేశించారు.దీంతో సమయం కోరిన వ్యాపారస్తులకు సమయం ఇవ్వకుండా షాపులకు తాళాలు వేశారు. ఈ వ్యవహారంపై వ్యాపారస్తులు కూచూరి ప్రవీణ్ ఇతరులు స్థానిక కోర్టును ఆశ్రయించారు.సోమవారం వ్యాపారస్తులు తరపున న్యాయవాది కంచి రాజగోపాల్,స్టాండింగ్ కౌన్సిల్ మధ్య వాదపవాదాలు జరిగాయి.కోవిడ్ 19 సందర్భంగా వ్యాపార రోజుల నష్టాన్ని భర్తీ చేయడానికి లైసెన్స్ వ్యవధిని పొడిగించాలని కొందరు లైసెన్స్‌దారులు ఆర్టీసీ శాఖని అభ్యర్థించారు. వారి ప్రాతినిధ్యాలను పరిగణనలోకి తీసుకుని, అటువంటి పొడిగింపును కోరుకునే లైసెన్స్‌దారులకు సంబంధించి,ప్రస్తుత ఒప్పందాల లైసెన్స్ వ్యవధిని ఒక సంవత్సరం పొడిగించాలని అప్పట్లో ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ ఉత్తర్వులు వెలువరించారు. దీని ప్రకారం తమకు ఒక సంవత్సరం కాలాన్ని అదనంగా పొడిగించాలని వ్యాపారస్తులు కోరారు. దీనికి ఆర్టిసి అధికారులు ఒప్పుకోలేదు. చివరకు బాధితులు కోర్టును ఆశ్రయించడంతో వ్యాపారస్తులు నిరాశ్రయులవుతారని భావించిన కోర్టు వారికి ఊరటం ఇచ్చింది. ఈ మేరకు షాద్ నగర్ జూనియర్ సివిల్ జడ్జి సూరజ్ సింగ్ స్టేటస్కో విధించారు...

# దివంగత వైఎస్ఆర్ సేవలు మరువలేనివి

**-పట్టణ అధ్యక్షులు మంచాల చిరంజీవులు**



**అక్షర విజేత, కొమురవెల్లి:** దివంగత నేత ఉమ్మడి ఏపీ మాజీ సీఎం వైఎస్సార్ సేవలు మరువలేనివని పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మంచాల చిరంజీవులు పేర్కొన్నారు. వైఎస్సార్ 15వ వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం రోజున చేర్యాల పార్టీ కార్యాలయంలో అయన చిత్రపటానికి పూలమాలలువేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్బంగా చిరంజీవులు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో రాజశేఖర్ రెడ్డి నిరుపేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని కొనియాడారు. విద్యార్థుల కోసం ఫీజు రీయింబర్స్?మెంట్, ఉచిత వైద్యం కోసం ఆరోగ్యశ్రీ పథకాలను రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టి ఉమ్మడి రాష్ట్ర ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారని కొనియాడారు. భారీ సాగునీటి ప్రాజెక్టులకు రూపకల్పన చేసిన ఘనత వైయస్ఆర్ కే దక్కుతుందన్నారు. ఆయన ఆశయ సాధన కోసం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, మార్కెట్ కమిటీ ఛైర్ పర్సన్ నల్ల నాగుల శ్వేత వెంకట్ చారి, కౌన్సిలర్ ఆడెపు నరేష్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ఉడుముల భాస్కర్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తడక లింగమూర్తి, కొమురవెల్లి ఆలయ మాజీ చైర్మన్ ఆడెపు చంద్రయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పుర్మ ఆగం రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీకాంత్, సినియర్ న్యాయవాది మనోహర్, కాటం శ్రీనివాస్, ముస్త్యాల యాదగిరి, అంబాల బుచ్చి రాములు, నీలం సన్నీ, రమేష్, అంజయ్య,తదితరులు పాల్గొన్నారు.

# వినాయక మండపాల ఆర్గనైజర్లు కార్యవర్గ సభ్యులతో పోలీసులు సమీక్ష సమావేశం

**-వినాయక మండపాల వివరాలు ఆన్లైన్లో పొందుపరిచి పర్మిషన్ తీసుకోవాలి.**

**-భిన్నత్వంలో ఏకత్వంలో పండుగలు నిర్వహించుకోవాలి.**

**-శాంతియుత వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవడం మంచి సంస్కృతి.**

**-పోలీస్ డిపార్ట్మెంట్ తరపున నిఘ సహాయ సహకారాలు అనునిత్యం ఉంటాయి.**



**అక్షర విజేత సిద్దిపేట** వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా ఉత్సవ కమిటీ సభ్యులు, మండపాల యజమానులు, వివిధ యువజన సంఘాల సభ్యులు పోలీసుల సలహాలు సూచనలు పాటించి ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలి ఈ సందర్భంగా సిద్దిపేట ఏసిపి మధు మాట్లాడుతూ

గణపతిని ప్రతిష్టించుకునే ఆర్గనైజర్లు కమిటీ మెంబర్లు హెచ్ టి టి పి://పోలీస్ పోర్టల్. టీఎస్ పోలీస్. గౌట్ ఇన్ లింక్ ద్వారా పోలీసు వారిచే అనుమతి తీసుకోవలసి సూచించారు శాంతిభద్రతలకు భంగం కలిగించని, రాకపోకలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉన్న ప్రదేశాలలో మాత్రమే వినాయకులను ఏర్పాటు చేసుకోవాలి,

వినాయక ప్రతిష్ట నుండి నిమజ్జనం పూర్తయ్యేంత వరకూ పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజలు ఆర్గనైజర్లు వినాయక మహోత్సవం కార్యక్రమంలో ఏ సమస్య ఉన్నా వాట్సాప్ లో మెసేజ్ చేస్తే వెంటనే సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. అన్ని మతాల వారు కలసి పండుగ జరుపుకోవడం సిద్దిపేట పట్టణంలో గొప్ప ఆచారమని తెలిపారు. పోలీసు వారి సలహాలు సూచనలు పాటించి ప్రశాంతమైన వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని కోరారు. ఎలక్ట్రిసిటి డిపార్ట్మెంట్ వారి పర్మిషన్ తీసుకుని కరెంటు వాడాలి. వినాయకుని మండపం రోడ్డు ప్రక్కన గాని ఖాళీ స్థలంలో గాని నిర్మించాలి. విగ్రహం యొక్క స్టేజి కింద ఎలాంటి వస్తువులు ఉంచరాదు.

మండపాల వద్ద తగినంత సంఖ్యలో స్థానిక సత్ప్రవర్తన కలిగిన వాలంటీర్లను నియమించి భక్తులను క్రమబద్ధీకరించే విధంగా చూడవలెను.గణేష్ మండపాలను మంచి నాణ్యత కలిగిన వస్తువుల తో ఏర్పాటు చేయవలెను మండపం మూడు వైపులా టార్పాలిన్ తో కప్పవలెను.మండపాలకు నాణ్యత కలిగిన వైరుతో కరెంట్ కనెక్షన్ ఇవ్వవలెను. వివాదాస్పద ప్రదేశాలలో మండపాలు ఉండకూడదు.ట్రాఫిక్ కు ఎలాంటి అంతరాయం కలిగించరాదు. గణేష్ మండపం వద్ద ముగ్గురు వాలంటీర్లు 24 %ఇ%7 తప్పకుండ కాపలా ఉండాలని ఉండాలని సూచించారు.

మండపాలలో అసాంఘిక కార్యకలాపాలకు తావివ్వకుండదు. మండపాల వద్ద టపాకాయలను ఇతర మందుగుండు సామాగ్రిని ఉంచరాదు. మండపం దగ్గర పూజా సమయాలలో భక్తుల వాహనాలను సరైన పద్దతిలో పార్కింగ్ చేయాలి. వినాయక విగ్రహాల కమిటీ మెంబర్ల పేర్లు అడ్రసు, సెలఫోన్ నంబర్లు పోలీసు స్టేషన్ లో ఇవ్వాలి. ఆన్ లైన్ లో అప్లై చేసుకున్న తర్వాత వచ్చిన మొదటి పేజీలో వచ్చిన సమాచారాన్ని 2 %ఇ% 2 సైజులో ఫ్లెక్సీ తయారుచేసుకొని మండపం ఎదురుగా ఉంచాలి.మహ్మదీయ ప్రార్ధన నమాజ్ సమయంలో లౌడ్ స్పీకర్లు వాడరాదు. విగ్రహాల దగ్గర బాక్స టైప్ స్పీకర్లను మాత్రమే వాడాలి ముందుగా పర్మిషన్ తీసుకోవాలి.

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఉదయం 6:00 గం ల నుండి రాత్రి 10:00 వరకు స్పీకర్లను మాత్రమే వాడాలి, స్పీకర్ సౌండ్ మోతాదులో నే ఉండాలి, ఇతరులకు ఇబ్బంది. కలుగకుండా చూడాలి, భక్తికి సంబంధించిన పాటలు మాత్రమే వేయాలి. లౌడ్ స్పీకర్లు విద్యాలయాలకు, ఆసుపత్రులకు, ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలకు ప్రార్ధన మందిరాలకు, ఇబ్బంది కలిగే విధంగా ఉండరాదు. గణేష్ మండపము ఇనుప రేకులతో ఉండాలి చుట్టూ బ్యారికేటింగ్ కట్టాలి.మండపాల వద్ద వాటర్ డ్రమ్ము మరియు ఇసుక తప్పకుండా ఉంచవలెను.మద్యం సేవించకూడదు. మద్యం సేవించి మండపాల వైపు రాకూడదు,. మహిళల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలి. మండపాలలో మరియు చుట్టూ తగినంత వెలుతురు ఉండేలా చూడాలి, విద్యుత్ కోత సమయాల్లో టార్చ్ లైట్లు లేదా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు విధిగా ఏర్పాటు చేసుకోవాలి.

రెచ్చగొట్టే పోస్టర్లు గాని, బ్యానర్లు గాని, కరపత్రాలను గాని పంచకూడదు, అంటించకూడదు. మండపాల వద్ద కొత్త వ్యక్తులు సంచరించినచో మరియు ఎలాంటి సమాచారమైన పోలీసు వారికి విధిగా తెలియపరచాలి. సోషల్ మీడియాలో వచ్చే అనవసర వదంతులను, పుకార్లు నమ్మరాదు. విగ్రహ ప్రతిష్ట నుండి మొదలుకొని నిమజ్జనం వరకు సంబంధిత ఆర్గనైజర్స్ పూర్తి భద్యత వహించవలెను. పెద్దలు నిర్ణయించిన తేదీ లోపల నిమజ్జనం పూర్తి చేయాలని సూచించారు.ఈ సమావేశంలో ఉత్సవ కమిటీ ఆర్గనైజర్లు, కన్వీనర్లు, మండపాల నిర్వాహకులు, వివిధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# వరద కష్టాల నుంచి గట్టెక్కిస్తాం

**-ముంపుకు గురవుతున్న కాలనీలలో -తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పర్యటన**



**అక్షర విజేత,తాండూరు:** తాండూరు పట్టణంలో భారీ వర్షాలతో వరద నీటిలో మునిగిపోతున్న కాలనీల్లో ఆక్రమణలను తొలగించి ప్రజలకు వరద కష్టాల నుంచి గట్టెక్కిస్తామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తెలిపారు.

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో వికారాబాద్ జిల్లా తాండూరు పట్టణంలో ముంపుకు గురైన ప్రాంతాలలో సోమవారం తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి క్షేత్రస్థాయిలో పర్యటించారు.

హైదరాబాద్ రోడ్ మార్గంలో, అలాగే పట్టణంలోని తులసి నగర్, పాత కుంట, మార్కేండేయ కాలనీతో పాటు పలు ప్రాంతాల్లో అధికార యంత్రాంగంతో కలిసి ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి క్షేత్ర స్థాయిలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. వర్షాల వల్ల ఎవరికైనా ఇబ్బందులు తలెత్తుతే తక్షణ సహాయం కోసం అధికారులను సంప్రదించాలని సూచించారు..

తాండూరు నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో కుంటలు, వాగులు, చెరువులు అలుగులు పారుతున్నాయని ముంపు ప్రాంతాల్లో ఉండే వారు జాగ్రత్తగా ఉండాలని ఎవరికైనా అత్యవసరంగా అధికారులను సంప్రదిస్తే పునరావాసం ఏర్పాటు చేస్తారని అన్నారు. అలాగే తాండూర్ మున్సిపల్ పరిధిలో చాలా వరకు లోతట్టు ప్రాంతాలు జలమయం అవ్వడంతో ప్రజలకు ఇబ్బందులు తలెత్తడంతో కాలనీలో పర్యటించి సమస్యలను ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి తెలుసుకున్నారు. పలు ప్రాంతాల్లో నాళాలు కబ్జాకు గురి అవ్వడంతో సమస్య తీవ్రంగా అయిందని, కబ్జాలకు గురైన ప్రాంతాలను రక్షించడానికి డిజాస్టర్ మేనేజ్మెంట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే మనోహర్ ప్రకటించారు.

అలాగే నూతనంగా ఏర్పాటు అయిన కాలనీలకు డ్రైనేజీ, రోడ్లు అవసరం ఉందని త్వరలోనే అన్ని కూడ పూర్తి చేస్తామని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి హామి ఇచ్చారు. ఎమ్మెల్యే గా గెల్చిన తర్వాత తాండూర్ మున్సిపల్ ను పూర్తి స్థాయిలో డిపిఆర్ ను తయారు చేయడం జరుగిందని దానికి అనుకూలంగా తాండూర్ మున్సిపల్ ను అభివృద్ధి చేస్తామని అన్నారు. ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సాయిపూర్ పొట్టోళ్ల బాల్ రెడ్డి వెంబడి తాండూర్ మున్సిపల్ పరిధిలో గల నాయకులు, మున్సిపల్ శాఖ, నీటిపారుదల శాఖ, విద్యుత్ శాఖ, ఆర్ అండ్ బి, రెవెన్యూ, పోలిస్ శాఖల అధికారులతో పాటు పలువురు ఉన్నారు.

Printed, published and owened by B.ANILKUMAR,H.NO:2-6, tharigoppula,jangaon dist; pin : 506224, Telangana state.published at DAIWIK PUBLICATIONS Pvt.ltd. printed at SNEHITHA PRINTERS, H.NO: 2-6, tharigoppula,jangaon Dist.pin : 506224, Telangana state.Editor : B.ANILKUMAR,Title code : TELTEL 02009,Cell : 7702866885.vijethatelugudaily@gmail.com